బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం-7, అక్టోబర్ - 2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

మూడు వారాల్లో పెన్షన్ బకాయిలు చెల్లించాలి



మిగతా 2లో..



కరువులో సర్కార్..
ప్రచారానికి 500 కోట్లు!

హైదరాబాద్, అక్టోబర్ 06 : ఒకవైపు ఎల్ నిన్ ప్రభావంతో రాష్ట్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. మరోవైపు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు ప్రభుత్వం డబ్బులు లేవంటున్నది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు కొరత అంటారు. పెన్షన్లకు కనీసం పెండింగ్ బిల్లులు కూడా ఇవ్వరు. ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ బిల్లులు నేటికి ఇంకా చెల్లించలేదు. కానీ, తన ప్రచారానికి మాత్రం రూ.వందల కోట్లను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేయడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే చెల్లింది.ఢిల్లీ టూర్లు, విదేశీ టూర్ల పేరుతో సీఎం, మంత్రులు ఇప్పటికే ప్రజాధనాన్ని దుబారా చేస్తుండగా, తాజాగా డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించే 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' ప్రచారానికే మొత్తం రూ.500 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. అసలు ఉన్నయో.. లేవో తెలియని దేశాల్లో కూడా ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు రూ.350 కోట్లు ఖర్చుచేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి



సంబంధించిన ప్రచార కార్యక్రమాలకు ఈ మొత్తాన్ని ఖర్చు చేయనున్నారు.విదేశాల్లో ప్రచారానికి రూ.350 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించగా, మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రచారాలకు, హైదరాబాద్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ జరిగే ప్రాంతంలో, మన రాష్ట్రంలో మీడియా, సోషల్ మీడియాల్లో ప్రచారానికి మరో రూ.150 కోట్లు ఖర్చుచేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం కూడా ఉన్నది. అంతర్జాతీయ, జాతీయస్థాయి ప్రచార కార్యక్రమాల పర్యవేక్షణ మొత్తం ముఖ్యమంత్రి నేతృత్వంలోని అధికారుల కనుసన్నల్లోనే చేపట్టనున్నారు. యూరప్‌లోని ఇంగ్లాండ్, ఆస్ట్రియా, బెల్జియం, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ తదితర దేశాలతోపాటు అమెరికాలోని పలు రాష్ట్రాల్లోనూ హైదరాబాద్‌లో

కుత్బుల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు శంకుస్థాపన

- **పేదల సొంతింటి కల సాకారం దిశగా అడుగులు: మంత్రి పొంగులేటి**

హైదరాబాద్, అక్టోబర్ 06 : మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలోని సర్వే నెం. 346 పరిధిలో తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన 'ఇందిరమ్మ ఇండ్ల టవర్స్' పనులకు మంగళవారం ఉదయం భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేయగా, జిల్లా ఇన్‌ఛార్జ్, ఐటీ–పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,స్థానిక శాసన సభ్యులు, బిఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ.వివేకానంద్ తో పాటు



పలువురు ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లబ్ధిదారులైన మహిళల సమక్షంలో, వారి చేతుల మీదుగానే భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

గాజులరామారం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి భూమిపూజ

అత్యాధునిక హంగులతో 4 టవర్లు.. 480 ఫ్లాట్లు

గాజులరామారంలో మొత్తం 2.60 ఎకరాల విస్తీర్ణంలో, రహదారి విస్తరణ

సీఎం విజయ్‌ని చూసి భయపడుతున్నారా?..

- **రాహుల్‌గాంధీపై డీఎంకే ఫైర్..!**



న్యూఢిల్లీ, అక్టోబర్ 06 : ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ని చూసి భయపడుతున్నారా..? అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ని ప్రతిపక్ష డీఎంకే ప్రశ్నించింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కు వ్యతిరేకంగా విపక్షాలు చేస్తున్న నిరసన కార్యక్రమానికి రాహుల్ గాంధీ నాయకత్వం వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయనకు ఊహించని రాజకీయ సెగ తగిలింది.తమిళనాడులో ఒకప్పటి మిత్రపక్షమైన డీఎంకే పార్టీ రాహుల్‌గాంధీని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించింది. డీఎంకే నేత శరవణన్ అన్నాదురై 'ఎక్స్' వేదికగా రాహుల్‌గాంధీని సూటిగా ప్రశ్నించారు. తమిళనాడులో ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల తొలగింపుపై రాహుల్‌గాంధీ వైఖరి ఏమిటని, 'సర్' అనంతరం ఎన్నికైన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయాలన్న మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలను రాహుల్‌గాంధీ ఎందుకు సమర్థించడం లేదని నిలదీశారు. ఇది ఎంతటి ద్వంద్వ నీతి అంటూ తన పోస్టులో రాహుల్‌గాంధీని ఘాటుగా విమర్శించారు.

దోపిడీని ప్రశ్నిస్తే జైలా..

- **మన్నె క్రిశాంక్ అక్రమ అరెస్ట్‌పై కేటీఆర్ ఆగ్రహం**
- **రేవంత్ కుటుంబ అక్రమాలను నిలదీసినందుకే కక్ష**

3లో..

ఏసీబీకి చిక్కిన ప్రభుత్వ ఉద్యోగులు

- **సిద్దిపేట జిల్లాలో 15 వేల లంచంతో పట్టుబడిన కార్యదర్శి, కారోబార్**
- **నాగర్‌కర్నూల్ జిల్లాలో 25 వేలతో పట్టుబడిన సీనియర్ అకౌంటెంట్**
- **జగిత్యాల జిల్లా కోరుట్ల ఆర్టీవో ఆఫీస్‌లో ఏసీబీ అధికారుల సోదాలు**



నారాయణరావుపేట అక్టోబర్ 6 : వివిధ పనుల కోసం వచ్చిన బాధితుల నుంచి ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు మంగళవారం రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ... సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి బీ అరుణ, కారోబార్ దాసరి సంతోష్ మ్యుటేషన్ కోసం ఓ వ్యక్తి వద్ద రూ.20 వేల లంచం డిమాండ్ చేశారు. బేరసారాల ద్వారా రూ.15 వేలకు ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలో జక్కాపూర్ పంచాయతీ కార్యాలయంలో బాధితుడి నుంచి రూ.15 వేల లంచం తీసుకుంటుండగా కార్యదర్శి, కారోబార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వీరిద్దరిని అరెస్ట్‌చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టారు.నాగర్‌కర్నూల్ జిల్లాలో మెడికల్ బిల్లు మంజూరు చేయడానికి ప్రభుత్వ ఉద్యోగి నుంచి రూ.25 వేలు తీసుకున్నారనే ఫిర్యాదుతో సీనియర్ అకౌంటెంట్ వెంకటయ్యను అదుపులోకి తీసుకున్నట్టు మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ తెలిపారు. అచ్చంపేట ప్రాంతానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి తన ఆరు నెలల మెడికల్ లీవ్, మెడికల్ బిల్లులు, అలవెన్సుల ప్రాసెస్ చేయడానికి పట్టణంలోని సబ్‌ట్రెజరీ (ఎస్టీవో) కార్యాలయంలో బిల్లులు సమర్పించాడు. రూ.3.60 లక్షల బిల్లులు మంజూరు చేసేందుకు సీనియర్ అకౌంటెంట్ వెంకటయ్య రూ.25 వేల లంచం డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన ఏసీబీ అధికారులు వెంకటయ్యను అదుపులోకి తీసుకున్నారు.

ఓటు చోరీపై విపక్షాల ర్యాలీ..
ఢిల్లీలో భారీ భద్రత

హైదరాబాద్, అక్టోబర్ 06 : న్యూఢిల్లీ: 'ఓటు చోరీ', సీఈసీ తీరును నిరసిస్తూ విపక్షాలు ఇచ్చిన 'సేవ్ డెమొక్రసీ' పిలుపుతో ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం చేశారు. ఇండియా బ్లాక్ ఎంపీలు మకర ద్వారం నుంచి నిర్వాచన్ సదన్ వరకు ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈసీ కార్యాలయం ముట్టడికి ముందస్తు అనుమతి లేదని ఢిల్లీ పోలీసులు తెలిపారు. లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా ఢిల్లీ పోలీసులు, సీఏపీఎఫ్‌కు చెందిన సుమారు 4 వేల మంది బలగాలను మోహరించారు. కేంద్ర ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో బహుళస్థాయి బ్యారికేడ్లు, ముళ్లకంచెలు ఏర్పాటు చేశారు. కన్నాట్ ప్లేస్, పటేల్ చౌక్, పార్లమెంట్ స్ట్రీట్, అశోకా రోడ్, జంతర్‌మంతర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని, వీలైతే మెట్రో సేవలను వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. ర్యాలీ నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్, డేటా సేవలకు అంతరాయం ఏర్పడినట్లు సమాచారం. నిరసనలను కవర్ చేసే జర్నలిస్టులు పీఐబీ, డీఐపీ అక్రిడిటేషన్ కార్డులు తప్పనిసరిగా ధరించాలని, దూరం నుంచి కవరేజ్ చేయాలని పోలీసులు సూచించారు. విపక్షాల ర్యాలీ నేపథ్యంలో కేంద్ర ఢిల్లీలో భద్రతా చర్యలు, ట్రాఫిక్ ఆంక్షలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



మంచిర్యాలలో కాంగ్రెస్ వర్గపోరుపై ఎమ్మెల్యే వర్గీయుల హెచ్చరిక



వివరాలు 2లో..

మహిళా క్రికెట్‌లో మంధాన శకం..

స్వదేశంలోనే తొలి సవాల్..!



న్యూఢిల్లీ, అక్టోబర్ 06 : భారత మహిళల క్రికెట్‌లో నవశకం మొదలైంది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ నుంచి వైదొలగడంతో ఆమె స్థానంలో ఓపెనర్ స్మృతి మంధాన నాయకురాలిగా ఎంపికైంది. స్వదేశంలో జింబాబ్వేతో వైట్‌బాల్ సిరీస్‌కు మంధానను సారథిగా ఎంపిక చేశారు సెలెక్టర్లు. వన్డేలతో పాటు టీ20లకు కెప్టెన్‌గా ఆమెను ప్రకటిస్తూ పటిష్టమైన స్క్వాడ్‌ను వెల్లడించారు. దాంతో.. ఈ సిరీస్ ముందు వరకూ వైస్ కెప్టెన్‌గా కొనసాగిన మంధాన ఇకపై పూర్తి స్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనుంది.మహిళా క్రికెట్‌లో స్మృతి మంధాన శకం షురూ అయింది. వెటరన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వారసురాలిగా స్మృతి మంధాన కెప్టెన్సీ చేపట్టింది. ఆసియా క్రీడల్లో వరసగా రెండో స్వర్ణం అందించిన హర్మన్.. స్వచ్ఛందంగా నాయకి పాత్రను వదులుకోగా ఆమె స్థానంలో మంధాన ఎంపికైంది. మంగళవారం జింబాబ్వే సిరీస్‌కు స్క్వాడ్‌ను ప్రకటించిన సెలెక్టర్లు ఈ ఓపెనర్‌ను సారథిగా అనౌన్స్ చేశారు. సీనియర్ దీప్తి శర్మకు వన్డే వైస్ కెప్టెన్‌గా.. ఓపెనర్ షఫాలీ వర్మకు టీ20 వైస్ కెప్టెన్‌గా అవకాశమిచ్చారు. ఇకపై స్లేయర్‌గానే కొనసాగనున్న హర్మన్‌ప్రీత్ వన్డే, టీ20 స్క్వాడ్లలోనూ చోటు దక్కించుకుంది. అక్టోబర్ 16 నుంచి భారత్, జింబాబ్వే మధ్య పొట్టి సిరీస్ జరుగనుంది.

కేబీఆర్ రీ–డిజైన్ పేరిట
భారీ దోపిడీకి స్కెచ్..

సర్దుబాటు ముసుగులో ఓ బడా కంపెనీకి లబ్ధి

హైదరాబాద్, అక్టోబర్ 06 : కేబీఆర్ పార్కు చుట్టూ ఐదు కిలోమీటర్ల మేర ఏడు ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి తొలి ప్రతిపాదనలు ఖర్చుగా చేశామని ఇందులో అండర్‌పాస్‌ల స్థలాన్ని మినహాయిస్తే ఫ్లై ఓవర్ దాదాపుగా 4 కిలోమీటర్లుగా అంచనా వేసి.. రెండో ప్యాకేజీలో కొత్త ఎలివేటెడ్‌లో చేర్చి సంబంధిత నాలుగు కిలోమీటర్ల ఖర్చును ఇక్కడ సర్దుబాటు చేసినట్లుగా అధికారులు చెబుతున్నారు. పాత పనులకు సంబంధించిన కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టు ఒప్పందాలను రద్దు చేశామని చెబుతున్న అధికారులు నూతన ఎలివేటెడ్ కారిడార్ పనులను మాత్రం ఏ విధమైన కొత్త టెండర్లు పిలవకుండానే ప్యాకేజీ -1లో పనిచేస్తున్న మేఘా వంటి బడా సంస్థకే అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడం అనేక అనుమానాలు తావిస్తోంది.ఒకే ఎలివేటెడ్ కారిడార్ కాబట్టి ఒకే కంపెనీకి ఇచ్చినట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. అప్పటికే సదరు కంపెనీ పనులు చేపట్టిందని వెనుకేసుకుని రావడం గమనార్హం. ఇక అగ్రసేన్, క్యాన్సర్ దవాఖాన జంక్షన్ల వద్ద అండర్‌పాస్‌ల నిర్మాణానికి భారీ గుంతలు తవ్వినా అధికారులు..ఇందుకోసం చేసిన ఖర్చుపై నోరు విప్పడం లేదు..పైగా కేబీఆర్ పార్కు చుట్టూ వన్ వే విధానం శాశ్వతంగా అమలు చేస్తున్నప్పుడు ఐ ల్యాండ్ ఉండవద్దని, జంక్షన్లలో చేసిన గుంతల ఖర్చు పెద్దగా నష్టం లేదని పేర్కొంటున్నారు. గత డిజైన్ ప్రకారం చేపట్టిన పనుల్లో భాగంగా రోడ్ల వెంట తవ్వినా భారీ గుంతలు, చెట్ల నరికివేత ప్రక్రియ ద్వారా వృథా అయిన మిగతా రూ. 300 కోట్లకు పైగా బడ్జెట్ పై అధికారులు పెదవి విప్పకపోవడం గమనార్హం. గతంలో చేసిన పనుల వ్యర్థాలు, కూల్చివేతలు, డిజైనింగ్ వ్యయం వల్ల పోయిన ప్రజాధనాన్ని ఎవరి ఖాతాలో వేస్తారో జీహెచ్ ఎంసీ సమాధానం చెప్పడం లేదు. ఒకవైపు అధికారులు రూ. 1,200 కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని మీడియా ప్రకటనలు

తప్పుడు వార్తకు క్షమాపణ చెప్పాల్సిందే..

ఈనాడుకు కేటీఆర్ లీగల్ నోటీసులు

హైదరాబాద్, అక్టోబర్ 06 : తన పాస్‌పోర్టును తాత్కాలికంగా జప్తు చేయాలని ఏసీబీ ప్రత్యేక కోర్టు ఆదేశించినట్టు ఈనాడు దినపత్రికలో తప్పుడు వార్త ప్రచురించినందుకు బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ఆ పత్రికకు లీగల్ నోటీసు జారీచేశారు. సెప్టెంబర్ 29న 'కేటీఆర్ సహా పలువురి పాస్‌పోర్టులు తాత్కాలిక జప్తునకు ఆదేశం' శీర్షికతో ప్రచురితమైన వార్త వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నదని పేరొంటూ కేటీఆర్ తరఫున న్యాయవాది ఎన్ లలితారెడ్డి లీగల్ నోటీసులు జారీచేశారు. ఈనాడు ఎడిటర్, పబ్లిషర్, ప్రింటర్, ప్రొప్రైటర్, రెసిడెంట్ ఎడిటర్, బ్యూరో చీఫ్, సంబంధిత రిపోర్టర్‌కు నోటీసులు పంపారు. కోర్టు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని, అయినప్పటికీ కేటీఆర్ పాస్‌పోర్ట్ జప్తుపై ఆదేశాలు వెలువడ్డాయని ప్రచురించడం ద్వారా ఆయన పరువుప్రతిష్టలకు భంగం వాటిల్లేలా చేశారని



పేరొన్నారు.పాఠకుల్లో తప్పుడు అభిప్రాయం కలిగించేలా వార్తను రాశారని అభ్యంతరం వ్యక్తంచేశారు. ఏసీబీ దర్యాప్తు అధికారి పాస్‌పోర్టులకు సంబంధించి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రత్యేక కోర్టులో మెమో దాఖలు చేసిన విషయాన్ని, కోర్టు పాస్‌పోర్ట్ జప్తునకు ఆదేశించినట్టుగా వార్తలో పేరొనడం మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉన్నదని న్యాయవాది తెలిపారు. కేటీఆర్ పాస్‌పోర్టును తాత్కాలికంగా జప్తు చేయాలని, స్వాధీనం చేసుకోవాలని లేదా కోర్టుకు

ఉద్యోగుల సమస్యలను పరిషరించాలి: చాడ

హైదరాబాద్, అక్టోబర్ 06 : తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్,అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల స మస్యలు పరిషరించాలని టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సిం గ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాడా వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం టూరిజం ఎండీ వల్లూరు క్రాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడారు.



కార్యక్రమంలో ఉడుత రమేశ్, పొంగలి శ్రీను, మనోహర్, మౌలాలి పాల్గొన్నారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

మూడు వారాల్లో పెన్షన్ బకాయిలు చెల్లించాలి

నిమ్స్ డైరెక్టర్‌కు తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ఆదేశం



హైదరాబాద్, అక్టోబర్ 06 :

నిమ్స్‌లో అనస్థీషియాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ మంత శ్రీనివాస్‌కు దాదాపు 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్ ప్రయోజనాలను మూడు వారాల్లోగా చెల్లించాలని తెలంగాణ మానవ హక్కుల కమి ఓషన్ ఆదేశించింది. డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్, గౌరవ చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన విచారణలో, డాక్టర్ శ్రీనివాస్ 13 నవంబర్ 2014న స్వచ్ఛంద పదవీ విరమణ (ఎ¬) పొందిన విషయాన్ని కమిషన్ గుర్తించింది. పెన్షన్ ప్రయోజనాలను విడుదల చేయాలని ప్రభుత్వం అక్టోబర్ 2023లోనే ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఇప్పటివరకు ఆయనకు రావాల్సిన ప్రయోజనాలు చెల్లించకపోవడంపై కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. పెన్షన్ అనేది ఉద్యోగి తన సేవల ద్వారా సంపాదించుకున్న హక్కు అని, వృద్ధాప్యంలో ఆర్థిక భద్రతతో పాటు గౌరవప్రదమైన జీవితం గడపడానికి అది ఎంతో కీలకమని కమిషన్ పేర్కొంది. ఇంత సుదీర్ఘకాలం పెన్షన్ ప్రయోజనాలను పెండింగ్‌లో ఉంచడాన్ని కమిషన్ తీవ్రంగా తప్పుబట్టింది. డాక్టర్ శ్రీనివాస్‌కు చెల్లించాల్సిన మొత్తం పెన్షన్ ప్రయోజనాలను మూడు వారాల్లోగా విడుదల చేసేలా నిమ్స్ డైరెక్టర్ వ్యక్తిగతంగా చర్యలు పర్యవేక్షించాలని కమిషన్ సూచించింది. తీసుకున్న చర్యలపై నివేదికను కూడా కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించింది. నిర్దేశించిన గడువులోగా ఆదేశాలను అమలు చేయకపోతే, నిమ్స్ డైరెక్టర్ స్వయంగా కమిషన్ ఎదుట హాజరై, పెన్షన్ చెల్లింపులో జరిగిన ఆలస్యానికి, ఆదేశాల అమలులో వైఫల్యానికి కారణాలను వివరించాల్సి ఉంటుందని కమిషన్ స్పష్టం చేసింది. ఈ కేసును 02.11.2026న అమలు నివేదిక కోసం తదుపరి విచారణకు ఉంచింది.

సిరిసిల్లలో తప్పు కంటికి ఆపరేషన్..

టీజీహెచ్ఆర్‌సీ సుమోటో

హైదరాబాద్, అక్టోబర్ 06 :

సిరిసిల్లకు చెందిన శ్రీమతి కొమ్ము వెంకమ్మకు ఎడమ కంటికి బదులుగా కుడి కంటికి శస్త్రచికిత్స చేసినట్లు వచ్చిన వార్తా కథనంపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టీజీహెచ్ఆర్‌సీ) సుమోటోగా స్పందించింది. ఆరోపణలు నిజమైతే వైద్య నిర్లక్ష్యం, రోగి భద్రత, శస్త్రచికిత్సకు ముందు రోగి లేదా కుటుంబ సభ్యుల నుంచి పొందిన సమ్మతి వంటి అంశాలపై తీవ్రమైన ఆందోళనలు తలెత్తుతాయని కమిషన్ పేర్కొంది. ఈ ఘటనపై రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (DM&HO) నుంచి సమగ్ర నివేదికను సమర్పిం చాలని కమిషన్ ఆదేశించింది. నివేదికలో రోగికి సంబంధించిన వైద్య రికార్డులు, వైద్యులు సూచించిన శస్త్రచికిత్స, వాస్తవంగా నిర్వహించిన శస్త్రచికిత్స వివరాలు, రోగి లేదా కుటుంబ సభ్యుల నుంచి పొందిన సమ్మతి, ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి, ఘటనపై నిర్వహించిన విచారణకు సంబంధించిన వివరాలను పొందుపరచాలని సూచించింది. ఈ కేసును నవంబర్ 6, 2026 ఉదయం 11 గంటలకు నివేదిక సమర్పణ కోసం విచారణకు ఉంచింది.

మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలి

హైదరాబాద్, అక్టోబర్ 06 :



జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైతన్య పురి డివిజన్ పరిధిలోని న్యూ దిల్‌సుఖ్‌నగర్ కమ్యూ నిటీ హాల్‌లో గత కొన్ని రోజులుగా నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ, బ్యూటీషి యన్, మెహందీ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన మహిళా సోదరీమణులకు సర్టిఫికెట్లను ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ,ట్రస్ట్ చైర్మన్ శ్రీమతి కమల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక మహిళ చేతిలో నైపుణ్యం ఉంటే ఒక కుటుంబం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుందని, ఒక కుటుంబం ఎదిగితే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలనే లక్ష్యంతో జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణలో ప్రాథమిక స్థాయి నుంచి ఆధునిక కుట్టు నైపుణ్యాలతో పాటు బ్యూటీషియన్, మెహందీ వంటి ఉపాధి అవకాశాలకు ఉపయోగపడే కోర్సుల్లో సమగ్ర శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడంతో పాటు, తమ కుటుంబ ఆర్థిక అభివృద్ధికి బలమైన పునాది వేసుకునే అవకాశం పొందుతారని అన్నారు. మహిళల నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,ఎల్.బి.నగర్ నియోజకవర్గ భారస పార్టీ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు,నర్సిరెడ్డి,రాపోలు సుధాకర్,విశ్వ ప్రేమ్,నాగలక్ష్మి,జయశ్రీ,శోభరాణి మరియు ట్రైనర్లు సునీత, భానుప్రియ, శివబిందు, అర్చన మరియు ట్రస్ట్ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, శిక్షణ పొందిన మహిళలు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పరకాల ఇందిరా మహిళా లేఅవుట్‌పై సమీక్ష

హనుమకొండ,అక్టోబర్ 06 : దామెర మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న పరకాల ఇందిరా మహిళా డెయిరీ లేఅవుట్, డిజైన్‌పై హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరకాల ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి డెయిరీ ఏర్పాటుకు సంబంధించిన లేఅవుట్, డిజైన్ తదితర అంశాలపై చర్చించారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, శాఖల వారీగా చేపట్టాల్సిన పనులపై అధికారులతో సమీక్షించారు. డెయిరీ ఏర్పాటుకు సంబంధించిన పనులను సమన్వయంతో చేపట్టి, ప్రాజెక్టు ఉద్దేశాలు నెరవేరేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని డెయిరీ లేఅవుట్, డిజైన్‌కు సంబంధించిన అంశాలపై తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు.

మల్కాజిగిరి ప్రజావాణిలో 29 ఫిర్యాదులు

హైదరాబాద్, అక్టోబర్ 06 : మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ సంచిత్ అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్లకు చెందిన ప్రజల నుంచి మొత్తం 29 ఫిర్యాదులు స్వీకరి ంచారు. సర్కిల్ వారీగా మల్కాజిగిరి నుంచి 4, మౌలాలి నుంచి 7, బోయిన్‌పల్లి నుంచి 0, అల్వాల్ నుంచి 4, కీసర నుంచి 14 ఫిర్యాదులు అందాయి. మొత్తం 29 ఫిర్యా దులను జోనల్ కమిషనర్ సమీక్షించారు.



మంచిర్యాలలో కాంగ్రెస్ వర్గపోరుపై

ఎమ్మెల్యే వర్గీయుల హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబర్ 06 : మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో వర్గపోరుకు దారితీసేలా వ్యవహరిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ తమ పద్ధతిని మార్చుకోవాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులు డిమాండ్ చేశారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలు కొనసాగితే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పీసీసీ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మంగళవారం మంచిర్యాలలోని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ని నిర్వహించిన మీడియా సమావేశంలో నగర మేయర్ ధరణి మధుకర్, మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పూదరి తిరుపతి మాట్లాడారు. మంచిర్యాల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చేపడుతున్న కార్యక్రమాలను కొందరు జీర్ణించుకోలేక పార్టీ అంతర్గతంగా విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. మంతెన జగన్మోహన్‌రావు కాంగ్రెస్ పార్టీలో విభేదాలకు కారణమయ్యేలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత నేతల స్పందన వెలువడాల్సి ఉంది.

అన్ని డివిజన్లకు ఎంపీ ల్యాడ్స్ నిధులు కేటాయించాలి

మంచిర్యాల నగరంలోని అన్ని డివిజన్ల అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్ నిధులను సమానంగా కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. నగరంలోని అన్ని డివిజన్ల ప్రజల ఓట్లతోనే ఎంపీ విజయం సాధి ంచారని, అందువల్ల ప్రతి డివిజన్‌కు అభివృద్ధి నిధులు అందేలా చూడాలని కోరారు. కార్పొరేషన్ పరిధిలో నిర్వహించే కొన్ని కార్యక్రమాల ఫ్లెక్సీల్లో మేయర్, డిప్యూటీ మేయర్, ఏఎంసీ చైర్మ న్‌ల ఫొటోలు ఉద్దేశపూర్వకంగా పెట్టడం లేదని ఆరోపించారు. ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి వివక్ష తగదని అన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంలో ప్రేమ్‌సాగర్‌రావు పాత్ర: వర్గీయులు

కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కీలక పాత్ర పోషించారని వారు పేర్కొన్నారు.



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమావేశం, ఇంద్రవెల్లి సభ తదితర కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఆయన పనిచేశారని తెలిపారు. ప్రస్తుతం కూడా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీకి చెందిన సర్పంచులు, కార్పొరేటర్లపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు.

ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రి పదవి ఇవ్వాలి

మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కు రాష్ట్ర మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఆయనకు మంత్రి పదవి లభిస్తే నియోజకవర్గ అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని అన్నారు.

కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్న అంశాలపై పార్టీ అధిష్ఠానం దృష్టి సారించి, పార్టీ క్రమశిక్షణను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వర్గీయులు కోరారు.

ఆర్టీసీలో కూటమి అభ్యర్థులను గెలిపించండి ఏఐటీయుసి

యాదాద్రి జిల్లా: భువనగిరి:

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, పెండింగ్ బకాయిల సాధన, కార్మిక సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ఐక్య కూటమి ఎంప్లాయిస్ యూనియన్, టిఎంయూ, ఎన్ఎంయు అభ్యర్థులను గెలిపించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి బోలగాని సత్యనారాయణ ఎండి ఇమ్రాన్ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐటీయూసీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ ఆధ్వర్యంలో భువనగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను కలిసి ఎన్నికల నేపథ్యంలో వారి సమస్యలు, సంఘాల కార్యాచరణ, భవిష్యత్ డిమాండ్లపై నాయకులు వివరించారు. డ్రైవర్లు--కండక్టర్లు, మహిళా కండక్టర్లు సిబ్బందికి ప్రత్యేకమైన వసతుల కోసం మరియు గ్యారేజీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారం కోసం సంఘాల ద్వారా నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని బోలగాని సత్యనారాయణ, ఎండీ ఇమ్రాన్ పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థుల కార్యక్రమం, కార్మికుల సమస్యలపై వారి వైఖరి, గతంలో నిర్వహించిన పోరాటాలను పరిశీలించి తమ నిర్ణయం తీసుకోవాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మంగ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు గనబోయిన వెంకటేష్, జిల్లా కోశాధికారి సామల శోభన్ బాబు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వడ్డేబోయిన సంతోష, రమేష్, తిరుపతి రెడ్డి, కృష్ణ, రాములు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



నాగార్జునసాగర్‌లో జర్నలిస్టులకు ఏఐ సోషల్ మీడియాపై శిక్షణ

- **ఈ నెల 12న నాగార్జునసాగర్‌లో వర్క్‌షాప్.. 75 మందికి అవకాశం**

నల్గొండ, అక్టోబర్ 06 : నాగార్జునసాగర్‌లో ఈ నెల 12న జర్న లిస్టులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సోషల్ మీడియా వినియో గంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. హిల్‌కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద యం నుంచి సాయంత్రం వరకు వర్క్‌షాప్ కొనసాగుతుందని పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టులకు ఏఐ, సోషల్ మీడియా విని యోగంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నిపుణులతో శిక్షణ అందించను న్నట్లు తెలిపారు. జర్నలిజం రంగంలో సాంకే తికత వేగంగా మారుతున్న నేపథ్యంలో ఏఐ, డిజిటల్ సాధనాలపై అవగాహన జర్నలిస్టులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. వార్తల సేకరణ, కంటెంట్ తయారీ, సోష ల్ మీడియా వినియోగంలో ఆధునిక సాంకేతికతను సమర్థ వంతంగా ఉపయోగించుకునేలా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపా రు. శిక్షణకు హాజరయ్యే జర్నలిస్టులు ఈ నెల 8వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచిం చారు. నల్గొండ కలెక్టరేట్‌లోని జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలి పారు. వర్క్‌షాప్‌లో గరిష్ఠంగా 75 మందికి మాత్రమే శిక్షణ ఇవ్వను న్నట్లు వెల్లడించారు. నాగార్జునసాగర్‌తో పాటు పరిసర ప్రాంతా లకు చెందిన జర్నలిస్టులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొ న్నారు. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు కోరారు.




‘డిండి’పై కాంగ్రెస్ కలవరం

హైదరాబాద్, అక్టోబర్ 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ‘డిండి’ ప్రాజెక్టుపై ఏ విధంగా ముందుకు సాగాలనే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నది. డిండి ప్రాజెక్టు పనుల దుస్థితి, కారణాలు తదితర అంశాలపై ‘నమస్తే తెలంగాణ’ ఇటీవల పలు కథనాలను ప్రచురించింది. ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందించేందుకు సత్వరమే ప్రాజెక్టును చేపట్టాలని నల్లగొండ జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టుబడుతుం డటం,మరోవైపు పాలమూరు లిఫ్ట్ స్కీమ్‌లో భాగంగా చేపడితే తమకు తీరని నష్టమని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజా ప్రతినిధులు వ్యతిరేకించడం, వెరసి ప్రాజెక్టు పనులు ముందుకు పడని దుస్థితి నెలకొన్నది. కాంగ్రెస్ నేతల మధ్య సయోధ్య లేక అధికారులు నలిగిపోతున్నారు. ఈ సందిగ్ధత నడుమ నాగర్‌కర్నూల్ చీఫ్ ఇంజినీర్ రాజీనామాకే సిద్ధమయ్యారు. ఆయా అంశాలపై ‘నమస్తే తెలంగాణ’ ప్రత్యేక కథనాలను ప్రచురించడంతో ప్రభుత్వ పెద్దలు రెండు రోజులుగా ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారు. ప్రాజెక్టుపై ఎలా ముందు కు వెళ్లాలనే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నారు.

ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ రిజైన్?

ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ (అడ్మిన్) రాజీనామా చేశారని తెలుస్తున్నది. ఆయన ఇప్పటికే ఉద్యోగ విరమణ పొందగా, ప్రభుత్వం ఎక్స్‌టెన్షన్ ఇచ్చింది. నవంబర్ నెలాఖరు వరకు ఆయనకు గడువు ఉన్నది. కానీ బాధ్యతల నుంచి తప్పించాలని ఇప్పటికే ప్రభుత్వానికి ఆయన విన్నవించుకున్నట్టు సమాచారం. ఈ మేరకు రాజీనామా సమర్పించారని తెలిసింది. వ్యక్తిగత కారణాలతోనే బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నారని జలసౌధ వర్గాలు వెల్లడిస్తున్నాయి.



బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

(మొదటిపేజీ తరువాయి)

కుత్బుల్లాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు శంకుస్థాపన

మినహాయించగా మిగిలిన 9,948 చదరపు మీటర్ల నికర స్థలంలో ఈ గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్టును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దు తున్నారు. మొదటి దశ కింద మొత్తం నాలుగు బ్లాకులను 'స్టిల్ట్ ం 10 అంతస్తుల' (ఎస్ ం10) శైలిలో అత్యాధునికంగా నిర్మించనున్నారు. ఒక్కో అంతస్తుకు 12 ఫ్లాట్ల చొప్పున మొత్తం 480 నివాస యూనిట్లను సిద్ధం చేస్తున్నారు. కామన్ ఏరియాతో కలిపి ఒక్కో ఇంటి విస్తీర్ణం 528.58 చదరపు అడుగులుగా ఉండనుంది. గేటెడ్ కమ్యూనిటీ తరహాలోనే ఈ ప్రాంగణంలో నివాస సముదాయంతో పాటు పిల్లల ఆట స్థలం కోసం 758 చదరపు మీటర్లు, వాణిజ్య అవసరాలకు 2,190 చదరపు మీటర్లు, ఓపెన్ పార్కింగ్ కోసం 1,613 చదరపు మీటర్ల స్థలాన్ని కేటాయించారు. అంతేకాకుండా కాలనీ వాసుల రాకపోకల కోసం 6 మీటర్లు, 10 మీటర్ల వెడల్పాటి విశాలమైన అంతర్గత రోడ్లను సైతం ఏర్పాటు చేస్తున్నారు.

పారదర్శక ఎంపిక.. 12 నెలల్లోనే గృహప్రవేశాలు

ఈ గృహాల కేటాయింపులో ఎలాంటి పైరవీలు, అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శక విధానాన్ని అమలు చేశామని మంత్రులు స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి అందిన 7 వేలకు పైగా దరఖాస్తులను పరిశీలించిన తర్వాత 5,200 మందిని అర్హులుగా గుర్తించామని, వారి సమక్షంలోనే బహిరంగ డ్రా పద్ధతిలో 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు మంత్రి పొంగులేటి వివరించారు. ఆన్‌లైన్ ద్వారా కేటాయింపులు పూర్తి చేసి ఎవరికి ఏ ఫ్లోర్‌లో ఫ్లాట్ వచ్చిందో అక్కడికక్కడే సర్టిఫికెట్లు అందజేశారు. దాదాపు రూ. 48 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ నిర్మాణాలను కేవలం 12 నెలల గడువులోనే పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అప్పగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గడువు కంటే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ. 48 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ. 96 లక్షల బోనస్ ఇస్తామని కాంట్రాక్టర్లను ప్రోత్సహించామని, నాణ్యతా ప్రమాణాలను లబ్ధిదారులే స్వయంగా వారానికోసారి పరిశీలించుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు.

లి కోట్లాది రూపాయల విలువైన భూమి పేదలకే అంకితం

హైదరాబాద్ మహానగరంలో స్థలాల ధరలు సామాన్యులకు అందనంతగా పెరిగిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో, పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మంత్రులు తెలిపారు. కూకట్‌పల్లి, బాచుపల్లి, నిజాంపేట్, మియాపూర్ వంటి ప్రధాన ప్రాంతాలకు సమీపంలో ఉన్న గాజులరామారంలో రూ. వందల కోట్ల విలువ చేసే విలువైన భూమిని ప్రభుత్వం పేదల నివాసాల కోసం కేటాయించిందని మంత్రి శ్రీధర్ బాబు గుర్తుచేశారు. ఈ ప్రాంత ప్రజల రాకపోకల సౌలభ్యం కోసం 40 అడుగుల రోడ్డును ఇప్పటికే 100 అడుగుల రోడ్డుగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. కేవలం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికే పరిమితం కాకుండా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 23 అర్బన్ నియోజకవర్గాల్లో ఒక్కో చోట మొదటి విడతగా 480 ఇళ్లతో ఇందిరమ్మ టవర్లను నిర్మిస్తున్నామని, మొదటి విడతలో ఇళ్లు రాని మిగతా అర్హులందరికీ రాబోయే రెండు, మూడు, నాలుగు విడతల్లో తప్పకుండా ఇళ్లు కేటాయిస్తామని మంత్రులు భరోసా ఇచ్చారు.

లి స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ...ఇందిరమ్మ ఇళ్ల పేరిట తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ ఇళ్ల సముదాయాలలోని లబ్ధిదారులకు ఇండ్లను కట్టించి ఇవ్వడమే కాదు, మౌలిక వసతులను కల్పించడంతో పాటు ప్రార్థన మందిరాలకు, వైకుంఠ ధామాల కోసం స్థలాలను కేటాయించి అభివృద్ధిపరిచేలా హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్, స్థానిక మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి పరచాలన్నారు.

కరువులో సర్కార్..ప్రచారానికి 500 కోట్లు!

డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు కొనసాగే గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తారు. రోడ్‌షోలు, ప్రకటనలు, సోషల్ మీడియా ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిసింది. యూరప్, అమెరికాతోపాటు దుబాయ్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో కూడా కార్యక్రమాలు చేపడుతామని ఓ అధికారి వెల్లడించారు.ఈ ప్రచార కార్యక్రమాలన్నీ ముఖ్యమంత్రి మీడియా సలహాదారు డైరెక్షన్‌లో ఇద్దరు ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల సారథ్యంలో కొనసాగుతాయని చెప్తున్నారు. ఇప్పటికే పలు ఏజన్సీలను పిలిపించి టారిఫ్‌లు మాట్లాడినట్లు తెలిసింది. వారం, పది రోజుల్లో రోడ్‌షోలు మొదలవుతాయని చెప్తున్నారు. మన దేశంలో కూడా ఏ రాష్ట్రంలో ఏంచేయాలన్న దానిపై రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ, సీఎం ముఖ్య పౌరసంబంధాల అధికారులు లెక్కలు వేసినట్టు తెలుస్తున్నది. వీరు రూ.150 కోట్లను ఖర్చు చేస్తారని సమాచారం. ఇప్పటికే వీరు కొన్ని ఏజెన్సీలతో ముందస్తు ఒప్పందాలు కూడా చేసుకున్నట్టు తెలిసింది. ఒక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లను కేవలం ప్రచారానికే ఖర్చు చేయబోతుండటంపై విమర్శలొస్తున్నాయి. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నదని ఒకవైపు చెప్తూనే, మరోవైపు కేవలం ప్రచార ఆర్భాటానికి రూ.500 కోట్లు ఖర్చు చేయడం, విదేశాల్లో రోడ్‌షోలు, ప్రచారానికి రూ.350 కోట్లు ఖర్చు చేయడం ఏందన్న విమర్శలు వస్తున్నాయి. అయితే, ఇందులో భారీఎత్తున అవినీతి జరిగే అవకాశం కూడా ఉన్నదని, ఒకట్రెండు ఏజెన్సీలకే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ఏసీబీకి చిక్కిన ప్రభుత్వ ఉద్యోగులు

ఫిర్యాదుదారుడి నుంచి ఆగస్టు 8న రూ. 3 వేలు, 18న రూ.22 వేల నగదు ఫోన్‌పే ద్వారా తీసుకున్నట్టు తేలింది. నిందితుడిని బుధవారం నాంపల్లి కోర్టులో హాజరుపర్చనున్నారు. నాగర్‌కర్నూల్ డీటీవో కార్యాలయం నుంచి వెంకటయ్య ఆగస్టు 24న అచ్చంపేట ఎస్టీవో ఆఫీస్‌కు బదిలీపై వచ్చారు. ఆయన స్వస్థలమైన ఆమనగల్లు నివాసంలోనూ సోదాలు నిర్వహించినట్టు డీఎస్పీ తెలిపారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో కరీంనగర్ రేంజ్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు, ఏజెంట్ల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, చలాన్లు, పెండింగ్ దరఖాస్తులు, కార్యాలయ పనితీరును పరిశీలించారు. మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లేకుండా వాహనదారులకు డ్రైవింగ్ పరీక్షలు చేస్తున్నట్టు తేల్చారు. ఆర్టీవో సిబ్బంది అధికారిక సేవల సమయంలో ఏజెంట్ల ద్వారా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు గుర్తించారు. సోదాల్లో ఏసీబీ డీఎస్పీ మహేందర్‌రెడ్డి, సీఐ తిరుపతి, ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఆర్ రీ-డిజైన్ పేరిట భారీ దోపిడీకి స్కెచ్..

చేస్తున్నప్పటికీ, ఆచరణలో మాత్రం టెండర్ల లేమి, ఖర్చుల అస్పష్టత, కాంట్రాక్టర్ల అనుకూల నిర్ణయాలు అనేక ప్రశ్నలను మిగులుస్తున్నాయి.ఇదిలా ఉండగా ఆరు నెలల క్రితం ప్రారంభించిన హెచ్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా ఏడు ఫ్లైఓవర్లు.. ఏడు అండర్‌పాస్‌లకు సంబంధించిన అంచనా వ్యయం రూ.1090కోట్లు అంటూ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. మొదటి ప్యాకేజీలో భాగంగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముగ్దా జంక్షన్ దాకా ఫ్లైఓవర్, చెక్‌పోస్ట్ నుంచి కేబీఆర్ పార్కు మెయిన్ గేటు ముందు నుంచి క్యాన్సర్ ఆస్పత్రి వైపు అండర్‌పాస్, పంజాగుట్ట వైపునుంచి జూబ్లీహిల్స్ వైపు 900 మీటర్ల మేర మూడు లేన్ల ఫ్లైఓవర్ , ఎల్‌వీ ప్రసాద్ వైపునుంచి పంజాగుట్ట వెళ్లే దారిలో ముగ్దా జంక్షన్ వద్ద 260 మీటర్ల మూడులేన్ల అండర్‌పాస్ నిర్మాణాలు చేస్తామని గతంలో ప్రకటించారు. వీటితో పాటు జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద 740 మీటర్ల వై షేప్ అండర్‌పాస్, 745 మీటర్ల నాలుగు లేన్ల ఫ్లైఓవర్, 770 మీటర్ల రెండు లేన్ల సెకండ్ లెవల్ ఫ్లైఓవర్‌ను నిర్మిస్తామని, వీటి నిర్మాణంతో జూబ్లీహిల్స్ రోడ్ నెం 45 వైపు నుంచి చెక్‌పోస్ట్, యూసుఫ్‌గూడ, కేబీఆర్ పార్కు వైపు వెళ్లే ట్రాఫిక్ సాఫీగా సాగుతుందని పేర్కొన్నారు.

తప్పుడు వార్తకు క్షమాపణ చెప్పాల్సిందే..

అప్పగించాలని ప్రత్యేక కోర్టు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని పేరొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించుకోకుండా శీర్షికలోనే పాస్‌పోర్ట్ జప్తునకు కోర్టు ఆదేశం' అనే పదాన్ని ఉపయోగించడం ద్వారా కోర్టు ప్రతికూల ఉత్తర్వులు ఇచ్చినట్టు ప్రజలకు తప్పుడు ప్రచారం చేసినట్టయిందని నోటీసులో తెలిపారు. వార్త ప్రచురణకు ముందు కోర్టు రికార్డులను పరిశీలించి, ఏసీబీ దాఖలు చేసిన మెమోపై కోర్టు ఏదైనా ఉత్తర్వు ఇచ్చిందా? లేదా? అన్నది నిర్ధారించుకోవాల్సిన బాధ్యత ఉన్నదని, అలా చేయకుండా తప్పుడు వార్తను ప్రచురణ చేసి కేటీఆర్ ప్రతిష్టకు నష్టం చేకూర్చారని స్పష్టం చేశారు.



దేశ రాజకీయాల్లో సంచలనం

హైదరాబాద్, అక్టోబర్ 06 : దేశ ఆర్థిక వ్యవస్థతో ఆడుకునే కార్పొరేట్ దిగ్గజాల వ్యూహాత్మక నిర్ణయం""దేశ ప్రముఖ కార్పొరేట్ సంస్థ ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ డైరెక్టర్, కార్పొరేట్ అఫైర్స్ శ్రీ పరిమళ నత్వాని 2000- 2026 ఏప్రిల్ వరకు శ్రీ జగన్ మోహన్ రెడ్డి పార్టీ వైస్సార్సీపీ నుండి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగి, శ్రీ జగన్ మోహన్ రెడ్డి ఓడిపోయాక ఖూా కూటమి భాగస్వామ్య పక్షమైన జార్ఖండ్ ముక్తి మోర్చా (హేమంత్ సొరేన్) మద్దతుతో జార్ఖండ్ నుండి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 17 అక్టోబర్ 2026న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్ నుండి తన సుపుత్రుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ డైరెక్టర్ ధనరాజ్ పరిమళ నత్వానికి సమాజ్‌వాదీ పార్టీ (అఖిలేష్ యాదవ్) నుండి రంగంలోకి దింపి ఏకగ్రీవ ఎన్నికకు రంగం సిద్ధం చేసిన పరిమళ నత్వాని, అంబానీ రాజకీ యాల్లో మార్పులు, 2029 లోక్ సభ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని కార్పొరేట్ సంస్థలు బీజేపీకి వెన్నుపోటు పొడవడానికి, కేసుల నుండి బయటపడడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నాయని రాజకీయ వర్గాల్లో గుసగుసలు.అర్థమైందా??

రేవంత్ సర్కార్‌కు మళ్లీ ఎదురుదెబ్బ

- అక్రమాలు బయటపెట్టినందుకు బీఆర్ఎస్ నేత క్రిశాంక్‌పై అక్రమ కేసు
- జైలుకు పంపాలని సర్కార్ పన్నాగం
- ఉదయం అరెస్ట్.. మధ్యాహ్నం కోర్టుకు
- కోర్టుకు తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరసరించిన న్యాయస్థానం
- బెయిల్ మంజూరు.. ఆపై విడుదల
- రేవంత్‌ను అదుపులో పెట్టుకో రాహుల్!.. కేటీఆర్ వార్నింగ్

హైదరాబాద్, అక్టోబర్ 06 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబసభ్యుల అవినీతి, అక్రమ దందాలను ఆధారాలతో బయట పెట్టిన బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్‌ను ఎలాగైనా అరెస్టు చేసి జైలుకు పంపించాలనుకున్న కాంగ్రెస్ నేతల పాచిక పారలేదు. రేవంత్ సర్కార్‌కు మళ్లీ కోర్టులో ఎదురుదెబ్బే తగిలింది. గతంలో కూడా ఇలాగే క్రిశాంక్‌ను జైలుకు పంపాలని ప్లాన్ చేసినా.. కోర్టు మొట్టి కాయలు వేయడంతో వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలను నోరుమూయించాలని కక్షసాధింపుతో వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కార్‌కు న్యాయస్థానాల్లో ఎదురుదెబ్బ తగులుతూనే ఉన్నది. తాజాగా శనివారం తెలంగాణభవన్‌లో మన్నె క్రిశాంక్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. 'అధికారాన్ని అడ్డంపెట్టుకొని రెండున్నరేండ్లలో సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబం రూ.50 వేల కోట్ల దోపిడీకి పాల్పడ్డది. ఇష్టారాజ్యంగా భూములు కొల్లగొడుతున్నది.కంపెనీల పేరిట యథేచ్ఛగా ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నది. మ్యాక్స్‌బియాన్ ఫార్మా.. మెడికవర్ దవాఖానల్లో సీఎం అల్లుడు గొలుగూరి సత్యనారాయణకు వాటాలున్నాయి. .2024 ఆగస్టులో దక్షిణ కొరియాలో హ్యుండాయ్ పెద్దలతో రేవంత్ కలిసిన నాలుగు నెలల తర్వాత 'గీతా' ఆటోమోటివ్స్ పేరిట హైదరాబాద్‌లో ఐదు హ్యుండాయ్ షోరూంలు ప్రారంభమయ్యాయి. మైండ్‌వాల్ట్ నిర్మాణ సంస్థ ద్వారా కూతురు నైమిషారెడ్డి కొంపల్లిలో ఇంటర్నేషనల్ కార్పొరేట్ స్కూల్ నిర్మిస్తున్నారు. భార్య, అల్లుడు, బిడ్డ కంపెనీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమోటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన బినామీ దుంప శిరీష భాగస్వామిగా ఉన్నారు. మెడికవర్‌ను రూ.13,200 కోట్లకు విక్రయించి బ్లాక్‌మనీని వైట్‌గా మార్చుకున్నారు' అంటూ సంచలన ఆరోపణలు చేశారు. తానుచేసిన ఆరోపణలు తప్పు అని నిరూపిస్తే ఇకపై జీవితంలో ప్రెస్‌మీట్ పెట్టనని క్రిశాంక్ సవాల్ విసిరారు.దీంతో తమ కుటుంబ వ్యవహారాలు బట్టబయలు చేశారని అక్కసుతో, మెడికవర్ దవాఖాన వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను ఉద్దేశిస్తూ వ్యంగ్యంగా వెలసిన బ్యానర్లకు క్రిశాంక్ బాధ్యుడని ఆరోపిస్తూ, కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. గాంధీభవన్ నుంచి సాయికుమార్ అనే వ్యక్తి సీసీఎస్ డీసీపీ చైతన్యకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్‌ఐఆర్ 668/2026 నమోదు అయింది. క్రిశాంక్ నివాసం చుట్టూ సోమవారం మఫ్టీలో పోలీసులు పహారా కాసినట్టు బీఆర్ఎస్ నేతలు ఆరోపిం చారు. ఈ



క్రమంలోనే మంగళవారం ఉదయం గోపాల పు రం పోలీసులు క్రిశాంక్‌ను అరెస్టు చేశారు. అనంతరం ఆయనను వైద్య పరీక్షల కోసం గాంధీ దవాఖానకు తరలిం చారు. వైద్య పరీక్షలు పూర్తయిన తర్వాత సికింద్రాబాద్ పదో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పద్మ ఎదుట హాజరుపరిచారు.

కానిస్టేబుల్‌కు అండగా కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 06 : డ్యూటీలో ఉండగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మెదక్ టౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ దేవసోత్ శంకర్‌కు బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. శంకర్ వైద్యానికి అయ్యే ఖర్చును వ్యక్తిగతంగా భరిస్తానని ఎక్స్ వేదికగా మంగళవారం ప్రకటించారు. బాధితుడు పూర్తిగా కోలుకొని సాధారణ స్థితికి వచ్చే వరకు ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని బాధిత కుటుంబానికి తెలుపాలని పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు సూచించారు.శంకర్‌ను కుటుంబ సభ్యులు పలు దవాఖానల చుట్టూ తిప్పినా బెడ్ల కొరత, ఈహెచ్ఎస్ సమస్యల కారణంగా సరైన సమయంలో వైద్యం అందలేదు. నిరుపేద కుటుంబానికి చెందిన శంకర్‌ను కాపాడుకొనేందుకు బంధువులు, తోటి కానిస్టేబుళ్లు రూ.1.5 లక్షలు సమకూర్చి ఆపరేషన్ చేయించారు. ప్రస్తుతం ఐసీయూలో ఉన్న ఆయనకు మరింత చికిత్స అవసరం కావడంతో సిబ్బంది విరాళాలు సేకరిస్తున్నారు. కానిస్టేబుల్ శంకర్ చికిత్స బాధ్యతను కేటీఆర్ తీసుకోవడంపై కుటుంబ సభ్యులు, సహచర పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.ఉద్యోగులు, పోలీసులకు ఆరోగ్య భరోసా క ల్పించాల్సిన ఈహెచ్ఎస్ వ్యవస్థ విఫలమైందని



ఆర్ఎస్పీ మండిపడ్డారు. శంకర్ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఉన్నతాధికారు లు స్పందిం చలేదని ఆరోపించారు. తన ట్వీట్‌కు స్పందించి కేటీఆర్ ముందుకొచ్చి వైద్య ఖర్చులు భరిస్తామని ప్రకటించిన తర్వాతే అధికారులు మేలొని ఈహెచ్ ఎస్ వర్తింపజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పోలీసులకు ఆరోగ్య భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

దోపిడీని ప్రశ్నిస్తే జైలా..

- మన్నె క్రిశాంక్ అక్రమ అరెస్ట్‌పై కేటీఆర్ ఆగ్రహం
- రేవంత్ కుటుంబ అక్రమాలను నిలదీసినందుకే కక్ష

హైదరాబాద్, అక్టోబర్ 06 : సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ అవినీతిని ఆధారాలతో నిలదీసినందుకే తమ పార్టీ నేత మన్నె క్రిశాంక్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయించిందని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. దేశానికి ప్రధానమంత్రి కావాలని కలలు కంటున్న రాహుల్ గాంధీ పిరికివాడిలా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఢిల్లీలో నిలబడి రాజ్యాంగ పరిరక్షణ గురించి గొప్పగా ఉపన్యాసాలిచ్చే రాహుల్, తెలంగాణలో మాత్రం తన తొత్తు రేవంత్‌రెడ్డి ద్వారా అరాచక పాలన సాగిస్తున్నారని విమర్శించారు.

రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ ఫిరాయింపులను బాహాటంగా ప్రోత్సహిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొకుతున్నదని కేటీఆర్ మండిపడ్డారు. 'ఓటు చోరీ' అంటూ గగ్గోలు పెట్టే రాహుల్ గాంధీ, తెలంగాణలో ఓటుకు నోటు కేసు సూత్రధారికే



ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ ఎవరిపైనైనా నిరాధార ఆరోపణలు చేయొచ్చు కానీ, ఆధారాలతో ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించిన క్రిశాంక్‌ను జైలుకు పంపుతారా? అని నిలదీశారు. ఇప్పటికైనా తన కీలుబొమ్మ రేవంత్‌ను అదుపులో పెట్టుకోవాలని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడం ఇకనైనా ఆపాలని రాహుల్ గాంధీకి హిత వు పలికారు. రాహుల్ గాంధీకి రేవంత్‌రెడ్డి అన్ లిమిటెడ్ ఏటీఎంలా మారారని కేటీఆర్ దెప్పిపొడిచారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఎన్ని కేసులు నమోదు చేసినా తాము భయపడేది లేదని తెల్చిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను బీఆర్ఎస్ పార్టీ నిరంతరం బట్టబయలు చేస్తూనే ఉంటుందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఆధారాలతో ప్రజల ముందుకు వస్తామని తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

హైదరాబాద్, అక్టోబర్ 06 : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సుప్రియ మృతి చెందగా.. బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్‌లో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అమెరికాలోని సెయింట్‌లూయిస్‌లో రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా మరి పెడకు చెందిన దారం శ్రీనివాస్-జ్యోతి కూతురు సుప్రియ మరణించారు. ఖమ్మంలో నివాసం ఉం టున్న శ్రీనివాస్ కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శిం చారు.అనంతరం ఆమె కేటీఆర్‌కు ఫోన్ చేయగా.. ఆయన సుప్రియ తల్లిదండ్రులతో మాట్లాడి పరామర్శించారు. అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సుప్రియ మృత దేహాన్ని తీసుకొచ్చేందుకు తమవంతు సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. బాధిత కుటుంబానికి సహాయ సహకారాలు అందిం చాలని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌కు సూచిం చారు. సత్యవతి రాథోడ్ మహబూబాబాద్‌లోని సుప్రియ మామ వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించి సుప్రియ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.



రేవంత్ కుటుంబ అవినీతిని ప్రశ్నిస్తే పోలీస్ కేసులా?



టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్

హైదరాబాద్, అక్టోబర్ 06 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల అవినీతిని ప్రశ్నించిన దళిత నేత క్రిశాంక్‌ను పోలీసులు అకారణంగా అరెస్టు చేసి వేధించడం తగదని టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల అవినీతి గురించి ఎవరూ ప్రశ్నించకూడదా? అని నిలదీశారు.తెలంగాణభవన్‌లో మంగళవారం ఆమె బీఆర్ఎస్ మహిళానేతలు మమత, అన్నపూర్ణ, షకీలారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. తన కుమార్తె నైనిషారెడ్డి విద్యాసంస్థలపై నిజమేమిటో? అబద్ధమేమిటో రేవంత్‌రెడ్డే చెప్పాలని డిమాండ్ చేశారు.

పోలీసు పోస్టుల్లో నాలుగు జిల్లాలకు అన్యాయం

హైదరాబాద్, అక్టోబర్ 06 : పోలీసు కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌లో మేడ్చల్- మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ జిల్లాలకు పోస్టులు కేటాయించకపోవడంపై నిరుద్యోగ అభ్యర్థులు భగ్గుమన్నారు. దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో నిరుద్యోగ అభ్యర్థులు మంగళవారం చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌండ్ల నాగేందర్‌గౌడ్ మద్దతు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ జైళ్లు, అగ్నిమాపక శాఖల్లోమొత్తం 7,437 పోస్టుల భర్తికి నోటిఫికేషన్ విడుదల చేశారు. మేడ్చల్- మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ జిల్లాల్లో ఖాళీలు ప్రకటించక పోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆయా జిల్లాల అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత :

గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



హైదరాబాద్, అక్టోబర్ 06 : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి మంచి భవిష్యత్ కోసం ఉన్నత విద్యను అభ్యసించాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, దాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని సూచించారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం మెదక్ జిల్లాలో పర్యటించారు. మెదక్ కలెక్టరేట్‌లో 'నషా ముక్త్ భారత్' ర్యాలీ ప్రారంభించారు. మహిళా శక్తి స్టాళ్ల ను పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రం గా మార్చేందుకు ముందుకు రావాలని సూచించారు.నషా ముక్త్ భారత్ విజయవంతానికి కృషి చేయాలన్నారు. రామాయంపేట-సిద్దిపేట మధ్యలో ఎన్‌హెచ్-765డీ వెంట 35 వేల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా జాతీయ రహదారి వెంట జీడిమామిడి మొక్కలు పెంచడాన్ని అభినందించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి వివేక్, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేశ్, ఎస్పీ డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

సామాన్యులపై ధరల మోత!?

సంపాదకీయం

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదైంది. ఈసారి భారత్?లోకి నైరుతి ఆగమనం ఆలస్యమైంది. భారత వాతావరణ శాఖ మే 26న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. జూన్ 1వ తేదీన కూడా ప్రవేశించలేదు. నాలుగు రోజులు ఆలస్యంగా కేరళలోకి ప్రవేశించాయి. కానీ ఆశించినంతంగా వర్షాలు కురవలేదు. ఈ లోటు వర్షపాతంతో నీటి ఎద్దడి ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంది. మరోవైపు వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయం సజావుగా సాగక వ్యవసాయాధారిత సరుకులపై తీవ్ర ప్రభావం చెపే ప్రమాదం లేకపోలేదు. తద్వారా సామాన్యులపై ధరల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది. ఆహార సంక్షోభం ఏర్పడే పరిస్థితులు కనబడుతున్నాయి. ఈ మధ్య న్యూయార్క్ ఏషియా సొసైటీ వేదిక మీద భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ రానున్న ఆహార సంక్షోభం గురించి చేసిన హెచ్చరికలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.. ఆయన చేసిన హెచ్చరిక కొత్తగా పుట్టుకు వచ్చింది కాదు. కొన్నాళ్లుగా దానిపై దేశంలో చర్చ నలుగుతూనే ఉన్నది. గోడదెబ్బ, చెంపదెబ్బ అన్నట్టుగా అంతర్జాతీయ సమస్యలు ఓ వైపు, పర్యావరణ క్షీణత మరోవైపు నుంచి తరుముతున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, ఇరాన్‌పై అమెరికా యుద్ధం, అంతర్జాతీయంగా చమురు, ఎరువుల సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. అమెరికా విధిస్తున్న పరిహార ఆంక్షలు దీనికి ఆజ్యం పోస్తున్నాయి. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, ఇంధన ధరల అస్థిరత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ఈ సంక్షోభం భారత్ మీద ఎంత ప్రభావం చూపుతున్నదో నిర్ణయించేది మన దేశీయ సంసిద్ధత, విధానాల పటిష్టత, రాజకీయ విజ్ఞత మాత్రమే. దిగుమతులపై అధికంగా ఆధారపడటం భారత ఆర్థిక వ్యవస్థ ప్రధాన బలహీనత. ఇంధనం, ఎరువులు, ముడిసరుకుల విషయంలో విదేశీ మార్కెట్లపై ఆధారపడటం వల్ల అంతర్జాతీయ ధరలు పెరిగితే దేశీయంగా ఆ భారం మోయక తప్పదు. మరోవైపు సబ్సిడీలు పెంచాల్సి రావడం సహజం, ఆర్థిక లోటు పెరుగుదల, పరిమిత ఆదాయ వనరులు ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ సామర్థ్యానికి పరీక్షలుగా మారాయి. ఇక ఎల్ నినో ప్రభావం ఈ సవాళ్లకు మరొక అదనపు ముప్పును జోడిస్తున్నది. సాధారణంగా ఎల్ నినో వల్ల వర్షపాతం తగ్గిపోయి, ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. దీనివల్ల పంటలు దెబ్బతిని ఆహార కొరత ఏర్పడుతుంది. మహారాష్ట్రలో ఇప్పటికే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. మన రాష్ట్రంలో ఈ ఏడాది మొత్తంగా చూస్తే వర్షపాతం సాధారణ స్థాయిలో ఉన్నట్టు చెప్తున్నప్పటికీ, 18 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఇటీవలి వర్షపాతం గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆగస్టులోనే సుమారు 38 శాతం వరకు వర్షాభావం నమోదవడం, మొత్తం మాన్సూన్ కూడా సాధారణ స్థాయికి తగ్గిపోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఏర్పడిన వర్షాభావంలో భాగమే ఇది. దేశం మొత్తం గత దశాబ్దంలోనే కనిష్ఠ వర్షపాతం నమోదవడం ఈ సమస్యకు స్పష్టమైన సూచన. నాగార్జునసాగర్ వంటి కీలక జలాశయాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో నిండలేదు. ప్రవాహాలు అస్థిరంగా ఉండటం వల్ల భవిష్యత్ నీటి లభ్యతపై స్పష్టత లేదు. ముఖ్యంగా సెప్టెంబర్‌అక్టోబర్‌లో వచ్చే ప్రవాహాలపై ఆధారపడే పరిస్థితి గతంలో ఉన్నా, ఇప్పుడు వర్షాల అస్థిరత కారణంగా ఆ నమ్మకం తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉన్నది. దక్షిణ భారత రాష్ట్రాల రిజర్వాయర్లు కేవలం సుమారు 50 శాతం సామర్థ్యంతోనే ఉండటం సమస్య తీవ్రతను తెలియజేస్తున్నది. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ అందుబాటులో ఉన్న ప్రాజెక్టులను పడావుపెట్టి, పెండింగ్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్ల సాగునీరు తగిన స్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. భూగర్భ నీటిమట్టాలు భారీగా పడిపోతున్నాయి. మరోవైపు పంట పెట్టుబడుల సమస్య వేధిస్తున్నది. ఇవన్నీ వెరసి సాగును సంకటంలో పడేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో ఆహార కొరత లేకపోయినప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తుల ధరల పెరుగుదల సమస్య మాత్రం తీవ్రంగానే ఉంటుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. బహిరంగ మార్కెట్లో ఈసరికే రూ.70 దాటిన బియ్యం ధరలు సెంచరీ కొడతాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.మరోవైపు ఉల్లిగడ్డల ధరలు కూడా కిలో రూ.60 దాటిపోయాయి. ఇక కూరగాయలు, ఇతర సరుకుల ధరలు సామాన్యులకు మోయరాని భారంగా పరిణమిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఆహార సమస్య తీవ్రరూపం దాల్చవచ్చని విదేశాంగమంత్రి చేసిన హెచ్చరిక ప్రాముఖ్యం సంతరించుకున్నది. ధరల సమస్య స్థానంలో తీవ్రమైన ఆహార కొరత ఎదురుకాకుండా చూడటం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పెనుసవాల్‌గా ఉంటుంది. తక్షణం వ్యవసాయరంగ సమస్యలపై అవి సమన్వయంతో దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఏది ఏమైనా ఈసారి ఎల్‌నినో సృష్టించిన ఈ పెను విపత్తును ముందుగా గ్రహించి ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుంటే తప్ప ఈ గండం నుండి గట్టెక్కే పరిస్థితులు లేవని నిపుణులు హెచ్చరిస్తున్నారు

ఓటర్ల హక్కుకు భంగం కలిగించేలా ఎన్నికల కమిషన్ నిర్ణయాలు : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, అక్టోబర్ : ఓటర్ల హక్కుకు భంగం కలిగించేలా ఎన్నికల కమిషన్ నిర్ణయాలు ఉన్నాయని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని పద్మారావు నగర్‌లో గల బెల్వర్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు.ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ꟻ×=) లో ఎన్నికల కమిషన్ బాధ్యతగా వ్యవహరించలేదని విమర్శించారు. బీఎల్‌వోలను కార్యక్రమంపై సరైన అవగాహన లేని వారిని నియమించారు. అనేక చోట్ల గందరగోళం నెలకొని లక్షల మంది ఓట్లు తొలగించబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలు జరిగిన ప్రతిసారి ఓటరు నమోదు ఎందుకు ? కొత్త ఓటర్ల వరకే పరిమితం చేయాలని సూచించారు.

కాకా ఆశయాల సాధనకు కృషి చేస్తాం



- **యువతకు ఉపాధి, పేదలకు న్యాయం, సామాజిక న్యాయం కోసం పోరాటం**
- **పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

హైదరాబాద్, అక్టోబర్ 06 :
దివంగత ప్రజానాయకుడు, తెలంగాణ ఉద్యమ యోధుడు కాకా వెంకటస్వామి 97వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న కాకా వెంకటస్వామి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని కాకా సేవలను, పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా కాకా చూపిన ఆప్యాయత, ప్రేమాభిమానాలే ఈరోజు అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చాయని అన్నారు. అధికార, ప్రతిపక్షాలకు అతీతంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కాకా అభిమానులు ఆయనకు నివాళులు అర్పించడం కాకా వ్యక్తిత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.తాను వ్యాపార రంగంలో ఉన్న సమయంలో దత్తాత్రేయ, జానారెడ్డి అందించిన సలహాలు, అండదండలను ఎప్పటికీ మరువలేనని వంశీకృష్ణ తెలిపారు. వేదికపై ఉన్న కేకే, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్ తదితర పెద్దల ఆశీస్సులు తనకు చిన్నప్పటి నుంచే లభించాయని గుర్తుచేశారు.

తెలంగాణ కోసం బుల్లెట్ తగిలినా వెనక్కి తగ్గని యోధుడు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కాకా వెంకటస్వామి చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఎంపీ అన్నారు. శరీరానికి బుల్లెట్ తగిలినా వెనక్కి తగ్గకుండా తెలంగాణ కోసం పోరాడిన యోధుడు కాకా అని కొనియాడారు. “తెలంగాణ వచ్చిన తర్వాతనే నా ఆఖరి శ్వాస విడుస్తా” అని పట్టుదలతో చెప్పిన కాకా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి చూపించారని వంశీకృష్ణ అన్నారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ పాలనను కాకా చూసి ఉంటే ఎంతో బాధపడేవారని ఆయన వ్యాఖ్యానించారు. కాకా లక్షలాది మంది నిరుపేదలకు, కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇప్పించి అండగా నిలిచారని, అయితే గత పదేళ్లలో జరిగిన భూకబ్జాలు, భూదందాలు, ఇసుక మాఫియాను చూస్తే బాధతో పాటు ఆగ్రహం కలుగుతోందని అన్నారు.

కార్మికుల పెన్షన్ రూ.10 వేలకు పెంచాలి

కాకా కార్మిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో కార్మికుల కోసం తీసుకొచ్చిన పెన్షన్ ఇప్పటికీ కేవలం రూ.500గా ఉండటం శోచనీయమని ఎంపీ పేర్కొన్నారు. కార్మికుల పెన్షన్‌ను రూ.10,000కు పెంచేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ పార్లమెంట్‌లో గట్టిగా పోరాడుతున్నామని తెలిపారు.

RFCLను నిర్లక్ష్యం చేస్తే ఊరుకోం

రామగుండం ఎరువుల కర్మాగారం =ళీజూ విషయంలో కాకా వెంకటస్వామి, మంత్రి వివేక్ వెంకటస్వామి కలిసి అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వంతో పోరాడి సుమారు రూ.10 వేల కోట్ల రుణభారం నుంచి సంస్థను బయటకు తీసుకురావడానికి కృషి చేశారని వంశీకృష్ణ గుర్తుచేశారు.RFCL ద్వారా సుమారు 3 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తోందని, అయితే సరైన నిర్వహణ లేకుండా ఢిల్లీ పెత్తనంతో సంస్థను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందేలా =ళీజూ యాజమాన్యం తీరుపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

కాకా ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ యువతకు ఉపాధి, నైపుణ్య శిక్షణ కల్పించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని ఎంపీ తెలిపారు. ఐవీజీవీ ద్వారా యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, Advanced Technology Centres (ATCs) ద్వారా ఆధునిక సాంకేతిక నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.ప్రతి సంవత్సరం వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కార్యక్రమాలను విస్తరిస్తున్నామని తెలిపారు.

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు కాకా కల

కాకా వెంకటస్వామి మరో ముఖ్యమైన కల ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు అని వంశీకృష్ణ తెలిపారు. ఆదిలాబాద్ ప్రాంతంలో సుమారు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ఇటీవల కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్‌తో చర్చించినట్లు చెప్పారు.ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడి జరిగిన నేపథ్యంలో, కాకా కలను సాకారం చేసే దిశగా ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.“కాకా చూపిన పోరాట బాటలోనే ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పనిచేస్తాం. ఆయన ఆశయాలను, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తీసుకెళ్లడం మనందరి బాధ్యత” అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.

కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

- **ప్రజా రవాణాను బలోపేతం చేస్తాం: పొన్నం**

హైదరాబాద్, అక్టోబర్ :హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్య వంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ బస్సు సేవలను అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రయాణికులకు ఒకే పాస్‌తో మరింత సులభంగా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం కల్పించింది. ఈ సౌకర్యం అమలు తీరును స్వయంగా పరిశీలించేం దుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మెట్రో రైలు, ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గణేష్, నవీన్ యాదవ్, అధికారులు కామన్ పాస్‌తో మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలువురు ప్రయాణికులతో నేరుగా మాట్లాడి కామన్ పాస్ వినియోగం ఎలా ఉంది? మెట్రో నుంచి బస్సుకు మారే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? ప్రయాణం సులభమైందా? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. కామన్ పాస్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు ప్రయాణికులు భట్టికి తెలిపారు. మెట్రోలో ప్రయాణించిన అనంతరం గమ్యస్థానానికి చేరుకునేం దుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల సమయం ఆదా అవుతోందని చెప్పారు. ప్రత్యేకంగా మరో టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకపోవడం సౌకర్యంగా ఉందన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత ఏ బస్సు ఎక్కాలి, ఏ మార్గంలో వెళ్లాలి అనే విషయంలో గతంలో ఎదురయ్యే అయోమయం కూడా తగ్గిందని ప్రయాణికులు వివరించారు. ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో--ఆర్టీసీ సేవలను అనుసంధానం చేయడం వల్ల రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతోందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి టీజీఎస్ఆర్టీసీ బస్సులో సెక్రటేరియట్ వరకు ప్రయాణించారు. బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చటిస్తూ కామన్ పాస్ వినియోగం, ప్రయాణ సౌకర్యం, మెట్రో--బస్సు అనుసంధానంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్ విధానం ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ బస్సులను సమన్వయంతో వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు గమ్యస్థానానికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, అయోమయం తగ్గుతాయని తెలిపారు. మెట్రోలో ప్రయాణిస్తున్న మహిళలు, ఇతర ప్రయాణికులతో మాట్లాడగా కామన్ పాస్ విధానం సౌకర్యవంతంగా ఉందని వారు చెప్పారని భట్టి పేర్కొన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత తమ ఇల్లు, కార్యాలయం లేదా ఇతర గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల ప్రయాణం మరింత సులభతరం అవుతుందని అన్నారు. ప్రజా రవాణాలోని వివిధ మార్గాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేసి ప్రయాణికులకు ‘సీమ్‌లెస్’ ప్రయాణ అనుభూతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ప్రస్తుతం మెట్రో--ఆర్టీసీ సేవలను అనుసంధానం చేశామని, భవిష్యత్తులో ఆటోలు, ఊబర్ వంటి ఇతర రవాణా సేవలను కూడా అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భట్టి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో ఆర్టీసీ--మెట్రో కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒకే పాస్‌తో ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు సమయం, శ్రమతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు

రామాయపట్నం రిఫైనరీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్

1,03,408 కోట్ల భారీ అంచనా వ్యయంతో ప్రాజెక్టు

అమరావతి,అక్టోబర్05: ఆంధ్రప్రదేశ్‌లో మరో భారీ ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది. నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌కు కీలక అడుగు పడింది. ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణుల అంచనా కమిటీ (ఈఏసీ) పచ్చజెండా ఊపుతూ సిఫారసు చేసింది. ఈ అనుమతితో ప్రాజెక్టు నిర్మాణ పనుల ప్రారంభానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. సుమారు రూ.1,03,408 కోట్ల భారీ అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రామాయపట్నం పోర్టు సమీపంలో దాదాపు 5,200 ఎకరాల భూమిని కేటాయించారు. ఏడాదికి 9 మిలియన్ టన్నుల (ఎంటీపీఏ) ఉత్పత్తి సామర్థ్యంతో దీనిని నిర్మిస్తారు. ఇందులో 5.4 మిలియన్ టన్నుల పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ వంటి రవాణా ఇంధనాలతో పాటు, 3.2 మిలియన్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తులను తయారు చేయాలన్నది లక్ష్యం. పర్యావరణ పరిరక్షణకు ఈ ప్రాజెక్టులో పెద్దపీట వేస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు ప్రాంగణంలో 30 శాతం, అంటే సుమారు 1,563 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనాన్ని (గ్రీన్ బెల్ట్) అభివృద్ధి చేయనున్నారు. పర్యావరణ నిర్వహణ ప్రణాళిక కోసం ప్రత్యేకంగా రూ.3,022 కోట్లు కేటాయించడం గమనార్హం. వీటితో పాటు గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన జోన్లు, రామాయపట్నం పోర్టుతో అనుసంధానించిన మెరైన్ క్రూడ్ ఆయిల్ టెర్మినల్ కూడా ఈ ప్రాజెక్టులో భాగం కానున్నాయి. ఈ రిఫైనరీ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మారనున్నాయని, దక్షిణ భారతదేశంలోనే ఇది ఒక ప్రధాన ఇంధన, పెట్రోకెమికల్ హబ్‌గా ఎదుగుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలో వేలాది మందికి, ఆ తర్వాత నిర్వహణ దశలోనూ వేల సంఖ్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు. అనుమతుల ప్రక్రియ ఖరారైన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు బీపీసీఎల్ సన్నాహాలు చేస్తోంది.

ఈనెల 10నుండి బతుకమ్మ వేడుకలు

- **18వరకు అత్యంత వైభవంగా నిర్వహణ**
- **రాష్ట్ర ప్రభుత్వ సిఎస్ సంజయ్ జాజు వెల్లడి**
- **బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష**

హైదరాబాద్, అక్టోబర్ : తెలంగాణా సంస్కృతీ ప్రత్యేకత గాంచిన బతుకమ్మ పూల పండగను ఈనెల 10 వ తేదీనుండి 18 వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పా ట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. ఈనెల 10 నుండి 18 వ తేదీ వరకు నిర్వహి ంచే బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పై శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యద ర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ ఈనెల 18 వ తేదీన సద్దుల బతుకమ్మ ను పురస్కరించు కొని ట్యాంక్ బండ్ పై వేలాది మంది మహిళలచే సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు



వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మ ల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సిఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమర వీరుల స్మారక కేంద్రం నుండి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. బతుకమ్మ జరిగే పది రోజుల పాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరి జం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు. బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబిం బించేలా ఈసారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని వెల్లడిం చారు. డిసెంబర్ లో జరుగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను కూడా ఈ లోగోలో తెలియచేసే విధంగా రూపొందించను న్నట్టు తెలిపారు.ఈ సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యే క కార్యదర్శి వాణి ప్రసాద్, సీపీ హైదరాబాద్ వీసీ సజ్జనార్, పంచాయితీ రాజ్ కమిషనర్ దివ్య, జీహెచ్ ఎం సి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఆర్టీసీ ఎం.డి.నాగిరెడ్డి, సీపీ మల్కాజిగిరి బి.సుమతి, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్), హైదరాబాద్ జోయెల్ డేవిస్,స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ముకుంద రెడ్డి, హార్టి కల్చర్ కమిషనర్ షేక్ యాస్మీన్ బాషా, జలమండలి అశోక్‌రెడ్డి,టూరిజం డైరెక్టర్ రంజిత్ నా యక్, శిల్పా రామం, సంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ. నర్సిం హారెడ్డి, ప్రత్యేక అధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఓటరుకూ ఓటు హక్కు కల్పించాలి



ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి..
రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకులు బాలమయాదేవి

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల


అర్హులైన ఏ ఒక్క ఓటరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకులు బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమయాదేవి ఆదేశించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి కమిషనర్ బాలమయాదేవి సమీక్ష నిర్వహించారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో జిల్లాలో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్ 87.68 శాతం పూర్తి చేశామని అధికారులు వెల్లడించారు. ఫారం -6, 7, 8 కింద మొత్తం 65,716 దరఖాస్తులు రాగా, 61,475 పరిష్కరించామని, మిగతావి పురోగతిలో ఉన్నాయని వివరించారు.

ఈ సందర్భంగా పరిశీలకులు కమిషనర్ బాలమయాదేవి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని పేర్కొన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి ఓటు హక్కు పునాది వంటిదన్నారు. ఓటు హక్కు దుర్వినియోగాన్ని అరికట్టడం ఎంత ముఖ్యమో.. అర్హులైన ఒక్క ఓటరూ ఓటు హక్కును కోల్పోకుండా చూడటం అంతే ముఖ్యమని స్పష్టం చేశారు.జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్న కలెక్టర్, అధికారులు, సహకరిస్తున్న రాజకీయ పార్టీల ప్రతినిధులను అభినందించారు. మిగిలి ఉన్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. బీఎల్ఓలు తప్పనిసరిగా ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాలని ఆదేశించారు.

మానాల దశ మారే వేళ..

- రూ.14.20 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..
- మూడు కీలక రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన..
- సూరమ్మ చెరువు నుంచి లిఫ్ట్ ద్వారా సాగు, తాగునీరు..
- మానాల ప్రజల చిరకాల నీటి సమస్యకు పరిష్కారం చూపుతాం: సుదర్శన్ రెడ్డి..
- రూ.7.43 కోట్లతో మరిమడ్ల రహదారి నిర్మాణం..
- రూ.5.60 కోట్లతో మానాల ప్రధాన రహదారి నాలుగు వరుసలుగా విస్తరణ..
- రూ.1.17 కోట్లతో హనుమాన్ తండా రహదారి నిర్మాణం..
- మానాల ప్రజల ప్రేమాభిమానాలకు మోహన్ రెడ్డి భావోద్వేగం..



బలగం టీవీ, రుద్రంగి :

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. గ్రామానికి కీలకమైన మూడు రహదారుల నిర్మాణానికి రూ.14.20 కోట్ల నిధులతో మంగళవారం పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు, మాజీ యూనియన్ కో-ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు పి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... మానాల ప్రజల చిరకాల నీటి సమస్యకు కూడా పరిష్కారం చూపుతామని సుదర్శన్ రెడ్డి తెలిపారు. రుద్రంగి మండలంలోని కలిగోట సూరమ్మ చెరువు పనులు తుది దశకు చేరుకున్నాయని, జలాశయం నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా మానాలకు సాగు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. రహదారి పనులను కూడా త్వరలో ప్రారంభించి వేగంగా పూర్తి చేసేలా చర్యలు చేపడతామని చెప్పారు.

మూడు రహదారుల్లో భాగంగా మరిమడ్ల రహదారి నిర్మాణానికి రూ.7.43 కోట్లు, మానాల ప్రధాన రహదారిని రెండు వరుసల నుంచి నాలుగు వరుసలుగా విస్తరించేందుకు రూ.5.60 కోట్లు, హనుమాన్ తండా (గొర్రెగుండం) రహదారి నిర్మాణానికి రూ.1.17 కోట్లు కేటాయించారు. ఈ పనులు పూర్తయితే మానాల గ్రామానికి రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి.

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ మానాల గ్రామానికి ప్రత్యేకమైన ఉద్యమాల చరిత్ర ఉందన్నారు. ప్రజా పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డులు, రైతుబంధు, రుణమాఫీతో పాటు వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. తనకు ఘన స్వాగతం పలికిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ డిసిసి అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. మానాల గ్రామం పేరునే తన ఇంటిపేరుగా పెట్టుకుని ప్రజల ఆదరాభిమానాలతో ఎదిగానని భావోద్వేగానికి గురయ్యారు. గ్రామ ప్రజల ప్రేమ, ప్రోత్సాహం తన ఎదుగుదలకు కారణమని పేర్కొంటూ కంటతడి పెట్టారు. గిరిజనులకు పోడు పట్టాల పునరుద్ధరణతో పాటు సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సుదర్శన్ రెడ్డిని కోరారు. రానున్న రోజుల్లో బాల్కొండ వర్గానికి ప్రాతినిధ్యం వహించాలనే తన కోరికని తన మనసులో మాట ప్రజలకు తెలిపారు. సూరమ్మ చెరువు నుంచి లిఫ్ట్ ద్వారా మానాలకు నీటిని అందించాలన్న విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించినందుకు మానాల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర శంకర్ గౌడ్, ఉప సర్పంచ్ దాసరి అశోక్, ఉర్దూ అకాడమీ కార్పొరేషన్ చైర్మన్ తాహెర్ బిన్ హైమద్, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో నటరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి, చందుర్తి సీఐ రవీందర్, ఎస్సై మోతీరామ్ నాయక్, రిటైర్డ్ ఏడీఈ భూక్య లక్ష్మణ్, తూమ్ జలపతి,కొమ్ముల రవీందర్,విడిసి చైర్మన్ జక్కుల శ్రీనివాస్, జక్కు మోహన్,లక్కాకుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,పలువురు సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వేధింపులను మౌనంగా భరించకండి.. ఎదురించండి



-ఒక్క ఫోన్ కాల్ చేస్తే రక్షణ కవచంలా షీ టీమ్
-ఎస్పీ మహేష్ బి.గితే

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

మహిళలు, బాలికలు, విద్యార్థినులు ఎలాంటి వేధింపులకు గురైనా మౌనంగా భరించకుండా నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ మహిళల భద్రతకు జిల్లా షీ టీమ్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఒక్క ఫోన్ కాల్ చేస్తే రక్షణ కవచంలా నిలుస్తుందని తెలిపారు.గడిచిన రెండు నెలల్లో షీ టీమ్‌కు అందిన ఫిర్యాదుల ఆధారంగా మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న ఆకతాయిలపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు, ఐదు పెట్టీ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

మహిళలు, విద్యార్థినులు, బాలికల రక్షణ కోసం పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యంగా అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమయ్యే వ్యక్తులతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించారు.

జిల్లాలో గుర్తించిన హాట్‌స్పాట్ల వద్ద షీ టీమ్ బృందాలు మఫ్టీలో నిత్యం నిఘా ఉంచుతున్నాయని తెలిపారు. మహిళలు, విద్యార్థినులను వేధించే ఆకతాయిలను గుర్తించి అదుపులోకి తీసుకుంటున్నామని, అవసరమైన సందర్భాల్లో చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు.విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాలు, రద్దీ ప్రాంతాల్లో షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, సామాజిక మాధ్యమాల మోసాలు, మహిళలకు సంబంధించిన చట్టాలపై విద్యార్థులు, మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యాసంస్థల్లో, రహదారులపై ప్రయాణించే సమయంలో లేదా పనిచేసే ప్రదేశాల్లో ఎవరైనా అపహేళనగా మాట్లాడటం, ఉద్దేశపూర్వకంగా వెంబడించడం, వేధింపులకు పాల్పడటం వంటి ఘటనలు ఎదురైతే వెంటనే జిల్లా షీ టీమ్ నంబర్ 8712656425కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులపై స్పందించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

-పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలి
-టీజీఎన్పీడీసీఎల్ సీఈ బి. అశోక్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

రైతులు, వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బి. అశోక్ అధికారుల ను ఆదేశించారు. మంగళవారం సిరిసిల్ల సర్కిల్ పరిధిలో పర్యటించిన సీఈ బి. అశోక్ ఎల్లారెడ్డిపేట 132/33 కేవీ సబ్‌స్టేషన్, గంజిసింగపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్, 33 కేవీ గంభీరావుపేట ఫీడర్‌ను పరిశీలించారు.

ఈ సందర్భంగా విద్యుత్ లోడ్లు, వోల్టేజ్ స్థాయిలు, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, ఫీడర్ల పరిస్థితి, వ్యవసాయ విద్యుత్ సరఫరాపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈ బి. అశోక్ మాట్లాడుతూ

వ్యవసాయ సీజన్ కొనసాగుతున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ అంతరాయాలు, లో-వోల్టేజ్ సమస్యలను సత్వరం పరిష్కరించాలని సూచించారు.

పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని ముందుగానే అంచనా వేసి అవసరమైన చోట సామర్థ్యం పెంచాలని ఆదేశించారు. విఫలమైన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని, అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. కండక్టర్లు, ఫ్యూజులు, ఇతర విద్యుత్ సామగ్రిని ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, తరలింపు, ఏర్పాటు పనులను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, వాటి తరలింపునకు శాఖ వాహనాలనే వినియోగించాలని అన్నారు . అధికారులు హెడ్‌క్వార్టర్లకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ మౌలిక వసతులను పరిశీలించాలని సూచించారు.వినియోగదారుల సమస్యలను సానుకూలంగా విని సత్వరం పరిష్కరించేలా అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలనిఅన్నారు . ఇక్కడ ఎస్ ఈ శ్రీనివాస్ రావు, డీఈ బి. అంజయ్య తదితరులు ఉన్నారు.



చేపల వేటకు వెళ్లి వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి..

బలగం టీవీ,గంభీరావుపేట:

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన ఘటన గంభీరావుపేట మండలంలో నాగంపేటలో చోటుచేసుకుంది.పోలీస్లు తెలిపిన వివరాల ప్రకారం

మల్లుపల్లి గ్రామానికి చెందిన కొమ్ము స్వామి (35) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడని,స్వామి సోమవారం ఉదయం చేపల వేటకు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడని తెలిపారు . రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామ శివారు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదని అన్నారు . మంగళవారం ఉదయం నాగంపేటకు చెందిన నర్ర రాజిరెడ్డి తన వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం నీటిపై తేలుతోందని సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని,మృతదేహం స్వామిదేనని గుర్తించి బయటకు తీశారని తెలిపారు . చేపల వేటకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి ఊపిరాడక మృతి చెందినట్లు పేర్కొన్నారు.మృతిని బంధువులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్. శ్రీకాంత్ తెలిపారు.



అనంతారంలో బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు

బలగం, టీవీ ఇల్లంతకుంట

ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో పెద్ద బతుకమ్మ నిమజ్జనం కోసం గ్రామ సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేష్ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని బ్రిడ్జి సమీపంలో ఉన్న చెత్త చెదారం ముళ్ల పొదలను ఎక్సవేటర్ సహాయం తో తొలగించి మహిళలు, గ్రామస్తులు నిమజ్జన స్థలానికి వెళ్ళందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చదును చేశారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ కదం జయంత్, వార్డ్ సభ్యులు మల్యాల రాజశేఖర్, పీటర్,రమేష్,నాయకులు నర్సయ్య, గోనెపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



రాచర్ల బొప్పాపూర్‌లో ఘనంగా పోషణ అభియాన్

పాల్గొన్న సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, వార్డు మెంబర్ అనూష, అంగన్వాడీ సూపర్వైజర్ బి. రేణుక, అంగన్వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అవగాహన కల్పించారు. పోషకాహార లోపం వల్ల కలిగే సమస్యలు, పిల్లల ఎదుగుదలలో సమతుల్య ఆహారం ప్రాధాన్యతపై తల్లులకు వివరించారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గీతాంజలి సూచించారు. పిల్లలకు చిన్న వయస్సు నుంచే పోషక విలువలు కలిగిన ఆహారం అందించి, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, తల్లులు పాల్గొని పోషణ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



సిరిసిల్ల మగ్గంపై దుబాయ్ రాజకుటుంబం

నూలుపోగులతో రాజకుటుంబ ప్రముఖుల ముఖచిత్రాలు
అద్భుత కళాఖండంగా ప్రత్యేక శాలువా.. బతుకమ్మ వేడుకల్లో ప్రదర్శన
రాజకుటుంబానికి కానుకగా సిరిసిల్ల నేత కళ

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

సిరిసిల్ల మగ్గం నుంచి వెలువడిన కళాఖండం ఖండాంతరాలు దాటుతోంది. నిన్నటి వరకు చీరలు, శాలువాలు, అందమైన వస్త్రాలను నేసిన అదే మగ్గంపై ఇప్పుడు దుబాయ్ రాజకుటుంబ ప్రముఖుల ముఖచిత్రాలు ఆవిష్కృతమయ్యాయి. నూలుపోగులను అక్షరాలా కళగా మలిచిన సిరిసిల్ల నేత కళాకారుడు వెల్ది హరి ప్రసాద్ తన అపూర్వ ప్రతిభతో రూపొందించిన ప్రత్యేక శాలువా దుబాయ్ రాజకుటుంబానికి కానుకగా చేరనుంది. సుమారు పదిహేను రోజులపాటు అవిశ్రాంతంగా శ్రమించి రూపొందించిన ఈ కళాఖండం దుబాయ్‌లో జరిగే బతుకమ్మ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

మగ్గంపై ముఖచిత్రాల మాయాజాలం

సిరిసిల్ల సంప్రదాయ మగ్గంపై నూలుపోగులతో దుబాయ్ పాలకుడు షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్, దుబాయ్ యువరాజు షేక్ హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్, షేక్ మక్తూమ్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ముఖచిత్రాలను హరి ప్రసాద్ అత్యంత సూక్ష్మంగా నేశారు.ముఖ కవళికలు, ఆకృతులు సైతం స్పష్టంగా కనిపించేలా రూపొందించిన ఈ శాలువా చూసిన వారిని అబ్బురపరిచేలా ఉంది. రంగురంగుల నూలుతో చిత్రకళను తలపించేలా ముఖచిత్రాలను మగ్గంపై ఆవిష్కరించడం సిరిసిల్ల నేత కళలో మరో అరుదైన ప్రయోగంగా నిలిచింది.

అభిమానంతో అల్లిన కానుక

దుబాయ్ పాలక కుటుంబంపై ఉన్న గౌరవం, అభిమానంతో ఈ ప్రత్యేక శాలువాను రూపొందించినట్లు కళాకారుడు తెలిపారు. తెలంగాణ నుంచి దుబాయ్‌కు వెళ్లి అక్కడ జీవనం సాగిస్తున్న లక్షలాది మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న దుబాయ్ పాలక కుటుంబానికి కృతజ్ఞతగా ఈ కళాఖండాన్ని అందించాలనే ఉద్దేశంతో దీనిని రూపొందించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో ప్రత్యేక ప్రదర్శన

దుబాయ్‌లో ఈ నెల 11న జరగనున్న బతుకమ్మ వేడుకల్లో ఈ ప్రత్యేక శాలువాను ప్రదర్శించనున్నారు. అనంతరం దుబాయ్ రాజకుటుంబానికి దీనిని ప్రత్యేక కానుకగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేదికగా సిరిసిల్ల నేత కళ దుబాయ్ రాజకుటుంబం ముందుకు వెళ్లడం విశేషంగా నిలుస్తోంది.

సిరిసిల్ల నుంచి దుబాయ్ దాకా

ఈ అపూర్వ కళాఖండాన్ని దుబాయ్‌కు తీసుకెళ్లేందుకు బలగం టీవీ సీఈఓ బాలు కాయితి, సివిల్ కాంట్రాక్టర్ జూపల్లి వెంకటరావు సహకారం అందిస్తున్నారు. పిచర కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రాజకుటుంబానికి ఈ శాలువాను అందించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ప్రపంచ వేదికపై సిరిసిల్ల నేతన్న ప్రతిభ

సిరిసిల్ల అంటే చేనేత.. చేనేత అంటే మగ్గం.. మగ్గం అంటే నూలుపోగుల సవ్వడి. ఆ నూలుపోగులే ఇప్పుడు దుబాయ్ రాజకుటుంబం వరకు చేరుతున్నాయి. తరతరాలుగా మగ్గాన్ని నమ్ముకుని జీవిస్తున్న సిరిసిల్ల నేతన్న చేతుల్లో రూపుదిద్దుకున్న ఈ కళాఖండం తెలంగాణ చేనేత వైభవానికి అంతర్జాతీయ గుర్తింపుగా నిలవనుంది. మగ్గంపై కదిలిన నూలుపోగులు,రాజకుటుంబ ముఖచిత్రాలుగా మారాయి,సిరిసిల్ల నేతన్న చేతుల్లో పుట్టిన కళ,దుబాయ్ రాజకుటుంబానికి కానుకగా మారుతోంది.



విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించాలి

-మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక విద్య అందించాలి..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బలగం టీవీ,వేములవాడ:

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఆధునిక విద్యా విధానాలను అందిపుచ్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించేలా పాఠశాలలు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.

వేములవాడ పట్టణంలోని హంసిని హైస్కూల్‌లో ఐఐటీ, నీట్, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పోటీ తత్వాన్ని పెంపొందించడంతో పాటు సృజనాత్మకతను వెలికితీయాలని సూచించారు.ప్రస్తుతం హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. పేద కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన పోటీ పరీక్షల శిక్షణ అందించేందుకు 2024లో వేములవాడ నియోజకవర్గంలోని కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో ఐఐటీ, నీట్, సివిల్స్‌కు సంబంధించిన ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించే స్థాయికి ఎదగడం విద్యారంగంలో వచ్చిన మార్పులకు నిదర్శనమన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, స్కిల్ యూనివర్సిటీలు, అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ల ద్వారా విద్యార్థులకు భవిష్యత్ ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించే ప్రయత్నం జరుగుతోందన్నారు.

పాఠశాలలు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసం, సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, విద్యార్థుల్లో తల్లిదండ్రులు, సమాజం నమ్మకాన్ని పెంచేలా నాణ్యమైన విద్య అందించాలని కోరారు.ఇక్కడ మున్సిపల్ చైర్మన్ రాజు, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ,కౌన్సిలర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్యాక్స్ చైర్మన్ వెంకటికి ఘన సన్మానం..

బలగం టీవీ, గంభీరావుపేట :

గంభీరావుపేట ప్యాక్స్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వేషాల వెంకటిని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన మున్నూరు కాపు (బీ) సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్యాక్స్ కార్యాలయంలో మంగళవారం వెంకటికి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జక్కు శ్రీనివాస్,మాజీ మండల అధ్యక్షుడు హమీద్, సంఘ సభ్యులు కముటం వెంకట్‌స్వామి, ఆకుల సత్తయ్య, రాజామలయ్య, ఉప్పు అరుణ్‌కుమార్, కంటం బాలరాములు, జక్కు తిరుపతి, కాస రాజశేఖర్, శంకర్,తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు

343 మందికి పరీక్షలు.. 28 మందికి పాదాల సమస్యలు గుర్తింపు

బలగం టీవీ,రుద్రంగి:

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 343 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించగా, 28 మందిలో పాదాలకు సంబంధించిన సమస్యలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.డా. సంపత్‌కుమార్ ఆధ్వర్యంలోని వైద్య బృందం అవసరమైన వారికి చికిత్స అందించి, తదుపరి వైద్య సేవలపై సూచనలు చేశారు . విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, పాదాలను శుభ్రంగా ఉంచుకోవడం, టాయిలెట్లకు వెళ్లేటప్పుడు పాదరక్షలు ధరించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే హాస్టల్ సిబ్బంది లేదా వైద్యులకు తెలియజేయాలని సూచించారు. వైద్య శిబిరంలో డా. రమణ, డా. సంపత్‌కుమార్, డా. ప్రభాకర్, డా. అభినయ, కేజీబీవీ ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.



షాట్‌పుట్‌లో సహస్ర ప్రతిభ

బలగం టీవీ, కరీంనగర్

70వ ఎస్‌జీఎఫ్‌ఐ అథ్లెటిక్స్ పోటీల్లో అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ 8వ తరగతి విద్యార్థిని ఈ. సహస్ర ప్రతిభ చాటింది. కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ వేదికగా నిర్వహించిన అండర్–17 బాలికల షాట్‌పుట్ విభాగంలో జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది.

సహస్ర సాధించిన విజయంపై పాఠశాల డైరెక్టర్ అనుదీప్ సౌగాని అభినందించారు. క్రీడల పట్ల ఆమెకున్న అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలను ప్రశంసించారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, విద్యార్థులు సహస్రను అభినందించారు. రానున్న పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రాజన్న ఆలయాన్ని కాంక్రీట్ కాదు.. కృష్ణశిలతో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలి

-కోడెల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

-సిరిసిల్ల సభలో తిట్లు తప్ప.. అభివృద్ధి ఏదీ..?

-తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

బలగం టీవీ,వేములవాడ:

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

మంగళవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న కవిత కోడె మొక్కు చెల్లించారు. అనంతరం నిర్వహించిన విలేకర్లు సమావేశంలో కవిత మాట్లాడుతూ.. దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన రాజన్న ఆలయ అభివృద్ధికి సుమారు రూ.250 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నిధులతో కాంక్రీట్ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఆలయ చారిత్రక వైభవం, ఆగమశాస్త్ర సంప్రదాయాలకు అనుగుణంగా కృష్ణశిలతో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. శిల్పులు, ఆగమశాస్త్ర నిపుణుల సూచనలు తీసుకుని తరతరాలు గుర్తుండిపోయేలా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

కోడెలకు తగిన పశుగ్రాసం, ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు పరిశీలించాలని కోరారు. కోడెలు మృతిచెందిన అనంతరం వాటికి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. ఈ అంశంపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ స్పందించాలని డిమాండ్ చేశారు.

వేములవాడ పట్టణంలో పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, రాజన్న చెరువు దుర్గంధంతో నిండిపోయిందని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించి చెరువు ప్రక్షాళన చేపట్టడంతో పాటు పట్టణానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. సుమారు రూ.5 కోట్లతో నిర్మించిన మార్కెట్లను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

లక్షా పది వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి

రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ఎంపీ బండి సంజయ్ స్పందించాలని కోరారు. మిడ్‌మానేరు–అప్పర్‌మానేరు–నర్మాల లింక్ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లక్షా పది వేల ఎకరాలకు సాగునీరు అందే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే పాదయాత్రలు, సైకిల్ యాత్రలు చేపట్టి ప్రజల్లోకి వెళ్తామని తెలిపారు.రుద్రంగి రిజర్వాయర్ పనుల్లో 2018 నుంచి ఇప్పటివరకు ఆశించిన పురోగతి లేదని ఆరోపించారు. కాలువల నిర్మాణం పూర్తయితే సుమారు 63 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ధూంపేట వద్ద వరద కాలువ నుంచి లిఫ్ట్ ఏర్పాటు చేసి, సనుగులలోని పటేల్ చెరువు, ఎర్రకుంట చెరువులను అనుసంధానం చేస్తూ 0.5 టీఎంసీల రిజర్వాయర్ నిర్మిస్తే వేములవాడ, కోనరావుపేట, చందుర్తి మండలాల పరిధిలోని భూములకు సాగునీరు అందించవచ్చని సూచించారు.



సిరిసిల్లకు నయాపైసా ఇవ్వలేదు

ముఖ్యమంత్రి సభలో విమర్శలు, ఆరోపణలు తప్ప సిరిసిల్ల అభివృద్ధికి నిధులు ప్రకటించలేదని ఆరోపించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. పదేళ్లు మంత్రులుగా ఉన్నవారు నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు.

మాజీ మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ల్యాబ్‌ల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ల్యాబ్‌ల కొరతతో విద్యార్థులు జగిత్యాల వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. సిరిసిల్ల మెడికల్ కళాశాలలో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కూడా లేవని ఆరోపించారు.

బీడీ కార్మికుల ఈఎస్ఐ ఆస్పత్రి ఎక్కడ..?

బీడీ కార్మికుల కోసం కేటాయించిన 15 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం ఏమైందని ప్రశ్నించారు. కార్మికుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆస్పత్రి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ (సెస్)ను ఎన్పీడీసీఎల్‌లో విలీనం చేయడం వల్ల రైతులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 24 గంటల్లోనే సమస్య పరిష్కరించే వ్యవస్థ ఉండేదని, ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు.

రేవంత్‌రెడ్డి–మహేష్‌గౌడ్‌ల జోడీ సూపర్‌హిట్ కాదని,ఒకరి వీపుపై ఒకరు గుద్దుకునే జోడీ అని, కాంగ్రెస్‌లో ఒకరు తానే ముఖ్యమంత్రి అంటుంటే, మరొకరు బీసీ ముఖ్యమంత్రి అంటున్నారని, ఆ పార్టీలో ఏం జరుగుతోందో ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి కాదు అని అబద్ధాలుద్దీన్ అని అన్నారు.ప్రతి సమస్యకు ఓ కమిటీ వేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని, ప్రజలకు తక్షణ పరిష్కారాలు అందించాల్సిన ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు.

జర్నలిస్టుల అక్రెడిటేషన్ విషయంలో కొత్త నిబంధనలు తీసుకొచ్చి వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉర్దూ మీడియా విలేకరులను చిన్నచూపు చూడొద్దని, మండలానికి ఒక్కరికే అక్రెడిటేషన్ ఇవ్వాలనే నిబంధనను పునఃపరిశీలించాలని కోరారు. జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే జర్నలిస్టులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.

వచ్చే శాసనసభ ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలోనూ తెలంగాణ రక్షణ సేన ప్రధాన రాజకీయ పార్టీలకు పోటీగా బరిలో నిలుస్తుందని ప్రకటించారు. ప్రజల సమస్యలపై తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. రైతులు, విద్యార్థులు, కార్మికులు, గల్ఫ్ బాధితులు, జర్నలిస్టుల, రాజన్న భక్తుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ప్రజలతో కలిసి ఉద్యమాలు చేపడతామని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు తమకు మద్దతుగా నిలవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు సంకపల్లి సుమలత శర్మ, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎండి అబ్దుల్ మజీద్, తదితరులు పాల్గొన్నారు.

పీబీ శ్రీనివాసాచారి సేవలు మరువలేనివి..



- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

- ముఖ్య ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాసాచారి ఉద్యోగ విరమణ..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

ముఖ్య ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాసాచారి సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కొనియాడారు. ముఖ్య ప్రణాళిక అధికారి/ఇంచార్జి డీపీఆర్ఓగా పీబీ శ్రీనివాసాచారి ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై మాట్లాడారు.

ముఖ్య ప్రణాళిక అధికారి పీబీ శ్రీనివాసాచారి ప్రణాళిక విభాగంలో దాదాపు 38 ఏండ్ల పాటు సేవలు అందించారని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, జన గణన, మహా శివరాత్రి ఇలా ప్రతి పనిని ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేశారని కొనియాడారు. అలాగే ఇంచార్జి డీపీఆర్ఓ గా సైతం ఉత్తమ సేవలు అందించారని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ తరువాత కాలం ఎక్కువగా కుటుంబానికి, సమాజానికి కేటాయించాలని సూచించారు. ఆయన అందించిన సేవలు ఎప్పటికీ గుర్తు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం శ్రీనివాసాచారి దంపతులను శాలువాలతో సన్మానించి.. సేవలను కొనియాడారు. ఇక్కడ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో రష్యాకు పంపి.. ఆర్మీలో చేర్పించారంటూ ఫిర్యాదు..

- ఏజెంట్‌పై కేసు నమోదు.. భర్తను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని భార్య వేడుకోలు..

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

మంచి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రష్యాకు పంపించి, అక్కడ తన భర్తను అతని ఇష్టానికి విరుద్ధంగా రష్యా ఆర్మీలో చేర్పించి ఉక్రెయిన్ సరిహద్దు యుద్ధ ప్రాంతానికి పంపించారని ఆరోపిస్తూ ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై ఎల్లారెడ్డిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన దోమటి రక్షిత, భర్త కిషన్, కులం రజక, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. తన భర్త దోమటి కిషన్‌కు సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో సిరిసిల్ల పట్టణానికి చెందిన అదిత్య మ్యాన్ పవర్ ఏజెంట్ ధర్నం శ్రీనివాస్ రష్యాలో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పినట్లు తెలిపింది. ఆయన మాటలు నమ్మిన తాము ఉద్యోగం కోసం రూ.2,50,000 చెల్లించినట్లు పేర్కొంది.



అనంతరం 2026 సెప్టెంబర్ 5న తన భర్త ఉద్యోగం కోసం రష్యా వెళ్లినట్లు రక్షిత తెలిపింది. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత అసలు విషయం తెలిసిందని, ఉద్యోగం పేరుతో తన భర్తను మోసం చేసి రష్యా ఆర్మీలో చేర్పించారని ఆరోపించింది. తనకు ఇష్టం లేకుండానే బలవంతంగా ఆర్మీలో చేర్చి ఉక్రెయిన్ సరిహద్దు యుద్ధ ప్రాంతానికి పంపించినట్లు తన భర్త ఫోన్ ద్వారా తెలిపాడని ఫిర్యాదులో పేర్కొంది. ఉద్యోగం పేరుతో మోసం చేసి తన భర్తను ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టిన ఏజెంట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, యుద్ధ ప్రాంతంలో ఉన్న తన భర్తను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రక్షిత పోలీసులను కోరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డిపేట ఎస్సై ఎన్. రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో ఏజెంట్ పాత్ర, నగదు చెల్లింపులు, రష్యాకు పంపిన విధానం తదితర అంశాలపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

కన్నతల్లిని ఇబ్బందులు పెడుతున్న కొడుకు

ఇల్లు, భూమి లాక్కుని రోడ్డున పడేసిన వైనం
వైద్యం, పోషణ భారం చూసుకోకుండా వేధింపులు
న్యాయం కోసం ఆర్డీవోను ఆశ్రయించిన బాధితురాలు


బలగం టీవీ, జగిత్యాల

కన్నతల్లిని ఆదరించాల్సిన కొడుకే ఆమె ఆస్తిని లాక్కుని, అనారోగ్యంతో ఉన్న వయస్సులో రోడ్డున పడేసిన అమానుష సంఘటన జగిత్యాల రూరల్ మండలంలో వెలుగుచూసింది. బాధితురాలు, సీనియర్ సిటిజెన్స్ ప్రతినిధుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి:

జగిత్యాల రూరల్ మండలానికి చెందిన బాదే బుచ్చమ్మ (85) అనే వృద్ధురాలు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. కాగా, ఆమె మరణించిన భర్త హన్మంత్ కష్టపడి సంపాదించిన ఇల్లు, మూడు గుంటల భూమిని ఆమె కొడుకు రాజేందర్ తన పేరిట బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆస్తి చేతికి వచ్చిన తర్వాత తల్లి పోషణ, వైద్య ఖర్చులు పట్టించుకోకపోగా, "ఎక్కడైనా పోయి చావు" అని ఇంట్లోంచి గెంటివేశాడు. దీంతో వేరే దారిలేక ఆ వృద్ధురాలు తన కూతురి వద్ద ఆశ్రయం పొందుతోంది.

ఆర్డీవోకు ఫిర్యాదు – కేసు నమోదు

తనకు జరుగుతున్న అన్యాయంపై బాధితురాలు జిల్లా సీనియర్ సిటిజెన్స్ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించింది. స్పందించిన సంఘ ప్రతినిధులు మంగళవారం ఆమెతో కలిసి జగిత్యాల ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారుల ఆదేశాల మేరకు 'వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం' కింద కేసు నమోదు చేశారు.



కన్నీటిపర్యంతమైన వృద్ధురాలు

అనంతరం సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుచ్చమ్మ తన గోడును వెళ్లబోసుకుంటూ కన్నీటిపర్యంతమైంది. తనను సొంత ఇంట్లోనే ఉంచి, సేవలు చేయడానికి ఒక పనిమనిషిని ఏర్పాటు చేయడంతో పాటు, వైద్యం మరియు జీవన పోషణ ఖర్చుల నిమిత్తం కొడుకు నుంచి నెలకు రూ.20 వేల పరిహారం ఇప్పించాలని కోరింది.

న్యాయం జరగకుంటే జిల్లా ఎస్పీని సైతం కలసి ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేసింది. ఈ సమావేశంలో వృద్ధురాలి కూతురుతో పాటు జిల్లా సీనియర్ సిటిజెన్స్ కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కాన్సిలియేషన్ అధికారి పి. హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యర్ 'శతక' ధమాకా

43 బంతుల్లోనే 102 రన్స్ అజేయ శతకం
వెస్టిండీస్‌పై 8 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం
టీ20 సిరీస్‌లో 1-0తో ఆధిక్యం

బలగం టీవీ, లక్నో

భారత జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సుడిగాలి శతకంతో విరుచుకుపడటంతో వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. లక్నోలోని ఏకానా స్టేడియంలో మంగళవారం జరిగిన ఈ పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత్.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.

కరీబియన్ల ఓస్తాద్ హోప్, రూథర్‌ఫోర్డ్

టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 19.1 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. విండీస్ బ్యాటర్లలో కెప్టెన్ షై హోప్ (52), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (56) అర్ధ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో నమన్ ధీర్ (3/31) మూడు వికెట్లతో మెరవగా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు తీశారు. అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్‌లకు తలో వికెట్ దక్కింది.



అయ్యర్ విధ్వంసం – ఇషాన్ తోడు

172 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ప్రారంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్లు అభిషేక్ శర్మ (21), సంజూ శాంసన్ (11) త్వరగానే పెవిలియన్ చేరడంతో 35 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి భారత్ కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపాడు.

ఎదుర్కొన్న తొలి బంతి నుంచే విండీస్ బౌలర్లపై విరుచుకుపడిన అయ్యర్, కేవలం 28 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. అనంతరం మరింత దూకుడు పెంచి మరో 24 బంతుల్లోనే సెంచరీ మార్కును అందుకున్నాడు. కేవలం 43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరోవైపు ఇషాన్ కిషన్ (37 నాటౌట్) అయ్యర్‌కు స్ట్రైక్ ఇస్తూ బాధ్యతాయుతమైన యాంకర్ పాత్ర పోషించాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు కేవలం 67 బంతుల్లోనే 137 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

దీంతో భారత్ 14.4 ఓవర్లలోనే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. రెండు జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ శుక్రవారం ఇండోర్ వేదికగా జరగనుంది.

సంక్షిప్త స్కోర్లు:

వెస్టిండీస్: 19.1 ఓవర్లలో 171/10 (రూథర్‌ఫోర్డ్ 56, షై హోప్ 52; నమన్ ధీర్ 3/31, కుల్దీప్ 2/28)

భారత్: 14.4 ఓవర్లలో 172/2 (శ్రేయస్ అయ్యర్ 102 నాటౌట్, ఇషాన్ కిషన్ 37 నాటౌట్; రోస్టన్ ఛేజ్ 1/28)



భారత మహిళా జట్టు కెప్టెన్‌గా మంధాన

అన్ని ఫార్మాట్ల సారథ్యం నుంచి తప్పుకున్న హర్మన్‌ప్రీత్
వైట్-బాల్ క్రికెట్‌కు కొత్త బాధ్యతలు
జింబాబ్వే సిరీస్‌తో ప్రారంభం కానున్న నూతన ప్రస్థానం

బలగం టీవీ, ముంబై/గౌహతి

భారత మహిళా క్రికెట్ జట్టు నూతన సారథిగా స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన నియమితురాలైంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇప్పటివరకు జట్టు కెప్టెన్‌గా కొనసాగిన హర్మన్‌ప్రీత్ కౌర్ అన్ని ఫార్మాట్ల నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో, ఆమె స్థానంలో వైట్-బాల్ క్రికెట్‌కు పూర్తిస్థాయి కెప్టెన్‌గా మంధానకు బాధ్యతలు అప్పగించారు. గౌహతిలో జరిగిన బీసీసీఐ సమీక్షా సమావేశం అనంతరం ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

నాయకత్వంలో అపార అనుభవం

2013లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన స్మృతి మంధాన, గతంలోనూ భారత జట్టుకు పలుమార్లు కెప్టెన్‌గా వ్యవహరించింది. ఇప్పటివరకు ఆమె 18 టీ20లు, 4 వన్డే మ్యాచ్‌లలో భారత జట్టును ముందుండి నడిపించింది. డొమెస్టిక్ మరియు ఫ్రాంచైజీ క్రికెట్‌లోనూ మంధాన తన నాయకత్వ పటిమను ఇప్పటికే నిరూపించుకుంది. ముఖ్యంగా ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టును 2024, 2026 సంవత్సరాల్లో విజేతగా నిలిపి రెండు టైటిళ్లను అందించింది.

గొప్ప గౌరవంగా భావిస్తున్నా: మంధాన

తన నియామకంపై మంధాన స్పందిస్తూ – "భారత జట్టుకు నాయకత్వం వహించే అవకాశం రావడం ఒక ప్రత్యేక గౌరవం. నాపై నమ్మకం ఉంచిన బీసీసీఐ, సెలక్టర్లు, సహచరులు మరియు అభిమానులకు కృతజ్ఞతలు. మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ అందించిన విశేష సేవలను గౌరవిస్తూ, భారత క్రికెట్‌ను మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు శ్రమిస్తాను" అని పేర్కొంది.

స్మృతి మంధాన నియామకంపై బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న జింబాబ్వే సిరీస్‌తో మంధాన పూర్తిస్థాయి కెప్టెన్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించనుంది.

ఒలింపిక్స్ 2036.. భారత్‌కు తీవ్ర పోటీ!



విశ్వక్రీడల ఆతిథ్యంపై రేసులో ఏడు దేశాలు
నవంబర్‌లో బిడ్డర్ల ప్రజెంటేషన్‌కు ఐఓసీ సిద్ధం
2029లో తుది వేదిక ఖరారు

బలగం టీవీ, న్యూఢిల్లీ

మరో పదహారేళ్ల తర్వాత జరగనున్న ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ 2036 ఆతిథ్య హక్కుల కోసం భారత్ ప్రమిస్తుండగా, అంతర్జాతీయంగా తీవ్ర పోటీ ఎదురవుతోంది. ఈ విశ్వక్రీడలను తమ దేశాల్లో నిర్వహించేందుకు భారత్‌తో పాటు మరో ఆరు దేశాలు గట్టిగా పోటీపడుతున్నాయని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) మంగళవారం అధికారికంగా వెల్లడించింది.

పోటీలో ఉన్న ప్రధాన దేశాలివే..

ఐఓసీ తెలిపిన వివరాల ప్రకారం 2036 ఒలింపిక్స్ నిర్వహణ హక్కుల కోసం భారత్, జర్మనీ, హంగేరి, ఖతార్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, దక్షిణాఫ్రికా, తుర్కియే రేసులో నిలిచాయి.

భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించాలనే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పావులు కదుపుతోంది. ఇప్పటికే 2024లోనే భారత్ తన ప్రతిపాదనలను ఐఓసీ దృష్టికి తీసుకెళ్ళింది. అయితే, ఐఓసీ నూతన అధ్యక్షురాలు కిర్స్టీ కొవెంట్రీ (జింబాబ్వే) బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఈ మొత్తం ప్రక్రియపై సమగ్ర సమీక్షకు ఆదేశించారు. ఇప్పటికే 2028 ఒలింపిక్స్‌కు లాస్ ఏంజెల్స్, 2032 వేదికగా ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ ఖరారైన సంగతి తెలిసిందే.

ఐఓసీ నిర్దేశించిన మార్గదర్శకాలు:

కఠిన పోటీ నెలకొన్న నేపథ్యంలో ఐఓసీ కొన్ని కీలక నిబంధనలను, కాలపరిమితులను విధించింది:

అక్టోబర్ 31 తుది గడువు: ఆసక్తి గల దేశాలు తమ ప్రాథమిక బిడ్డింగ్ ప్రతిపాదనలను ఈనెల 31 నాటికి ఐఓసీకి పంపించాల్సి ఉంటుంది.

వర్చువల్ ప్రజెంటేషన్: బరిలో నిలిచిన ఏడు దేశాల ప్రతినిధులు ఈ ఏడాది నవంబర్‌లో ఐఓసీ 'ఫ్యూచర్ హోస్ట్ కమిషన్' ముందు వర్చువల్ పద్ధతిలో తమ ప్రాజెక్ట్ ప్రజెంటేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.

సుదీర్ఘ పరిశీలన: 2027 మార్చిలో ఐఓసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు వ్యూహాత్మక చర్చలు జరిపి, ప్రాజెక్టుల సమర్థతను పరిశీలిస్తుంది.

అన్ని అంశాలను సునిశితంగా గమనించిన అనంతరం 2028 డిసెంబర్‌లో అర్హత సాధించిన దేశాలతో ఐఓసీ తుది చర్చలు జరుపుతుంది. చివరగా 2029 ఆరంభంలో లేదా మధ్యలో ఐఓసీ సభ్యులందరి ఓటింగ్ ఆధారంగా 2036 ఒలింపిక్స్ ఆతిథ్య దేశాన్ని అధికారికంగా ప్రకటిస్తారు.



భారత్‌పై ఉరుగ్వే ఆధిపత్యం

ఫ్రెండ్లీ మ్యాచ్‌లో 6-1తో క్లీన్‌స్వీప్
అనిరుధ్ థాపా ఒక్కడే ఒక గోల్
రెండో అర్ధభాగంలో భారత్ రక్షణ శ్రేణి విఫలం

బలగం టీవీ, కోల్‌కతా

అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన ఉరుగ్వే జట్టు విజృంభించింది. మంగళవారం స్థానిక మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ఉరుగ్వే 6-1 గోల్స్ తేడాతో భారత జట్టుపై అలవోక విజయం సాధించింది. మూడు రోజుల వ్యవధిలో భారత్‌కు ఇది రెండో ఘోర పరాజయం కావడం గమనార్హం.

తొలి అర్ధభాగంలో పోటీ

మ్యాచ్ ప్రారంభమైన 11వ నిమిషంలోనే ఉరుగ్వే ఖాతా తెరిచింది. భారత డిఫెండర్ ప్రామ్‌వీర్ సింగ్ ఫౌల్ చేయడంతో లభించిన పెనాల్టీని డార్విన్ నునెజ్ గోల్‌గా మలిచాడు. అయితే 22వ నిమిషంలో భారత్ అద్భుతంగా కోలుకుంది. రయాన్ విలియమ్స్ కొట్టిన షాట్‌ను ఉరుగ్వే గోల్‌కీపర్ త్యాగో కార్డోజో నిరోధించగా, రీబౌండ్ అయిన బంతిని అనిరుధ్ థాపా నెట్‌లోకి పంపి స్కోరును 1-1తో సమం చేశాడు.

ఆ తర్వాత 28వ నిమిషంలో ఉరుగ్వే ఆటగాడు మాక్సిమిలియానో అరాజో గోల్ చేసి తమ జట్టుకు 2-1 ఆధిక్యాన్ని అందించాడు. అనంతరం మెరుపులు, ఉరుముల కారణంగా మ్యాచ్‌కు కొంతసేపు విరామం లభించింది.

రెండో అర్ధభాగంలో ఏకపక్షం

ఆట తిరిగి ప్రారంభమయ్యాక ఉరుగ్వే దాడులను తిప్పికొట్టడంలో భారత డిఫెండర్లు తీవ్రంగా విఫలమయ్యారు.

53వ నిమిషం: రోడ్రిగో జలాజర్ గోల్ చేయడంతో ఉరుగ్వే ఆధిక్యం 3-1కి పెరిగింది.

59వ నిమిషం: అరాజో వ్యక్తిగత రెండో గోల్‌తో స్కోరు 4-1గా మారింది.

71వ నిమిషం: జువాన్ మాన్యువల్ సనాబ్రియా ఐదో గోల్ నమోదు చేశాడు.

86వ నిమిషం: రోడ్రిగో అగ్యురే ఆరో గోల్ సాధించి ఉరుగ్వే ఘనవిజయాన్ని ఖాయం చేశాడు.

ఖాలిద్ జమీల్ శిక్షణలోని భారత జట్టుకు ఈ అంతర్జాతీయ విండో తీవ్ర నిరాశను మిగిల్చింది. పనామాతో మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకున్న భారత్, అంతకుముందు శనివారం బ్రెజిల్ చేతిలో 0-4 తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే.

స్కోరు వివరాలు:

ఉరుగ్వే: 6 (డార్విన్ నునెజ్ 11' [P], మాక్సిమిలియానో అరాజో 28', 59', రోడ్రిగో జలాజర్ 53', జువాన్ మాన్యువల్ సనాబ్రియా 71', రోడ్రిగో అగ్యురే 86')

భారత్: 1 (అనిరుధ్ థాపా 22')

న్యూజిలాండ్ పర్యటనకు భువీ రీఎంట్రీ

శ్రేయస్ అయ్యర్ సారథ్యం.. నాలుగేళ్ల తర్వాత జట్టులోకి భువనేశ్వర్ కుమార్

బలగం టీవీ, న్యూఢిల్లీ

న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లే భారత టీ20 జట్టులోకి నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భువనేశ్వర్ కుమార్ రీఎంట్రీ ఇచ్చాడు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని 16 మంది సభ్యుల జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరపున భువనేశ్వర్ రాణించడంతో అతడిని ఎంపిక చేయాలన్న డిమాండ్లను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు వెటరన్ పేసర్ మహమ్మద్ షమీకి చోటు దక్కలేదు.

ఐదు టీ20ల సిరీస్‌కు జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి కల్పించారు. టెస్టు సిరీస్ నేపథ్యంలో అతడికి విశ్రాంతి ఇచ్చినట్లు సమాచారం. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. గాయంతో దూరమైన వరుణ్ చక్రవర్తి కూడా జట్టులోకి వచ్చాడు.

అక్టోబర్ 22న తొలి టీ20, 24న రెండోది, 27న మూడోది, 30న నాలుగోది, నవంబర్ 1న ఐదో టీ20 జరగనుంది.

భారత్ టీ20 జట్టు: శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, భువనేశ్వర్ కుమార్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్.

భారత్-ఏ జట్టులో రాహుల్, పంత్

న్యూజిలాండ్ పరిస్థితులకు అలవాటు పడేందుకు భారత్-ఏ జట్టులో పలువురు టెస్టు ఆటగాళ్లకు చోటు కల్పించారు. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, అకీబ్ నబీ, ఆకాష్ దీప్, అన్షుల్ కాంబోజ్, మానవ్ సుతార్, సాయి సుదర్శన్, ముఖేష్ కుమార్ తదితరులు జట్టులో ఉన్నారు. మూడు అనధికారిక టెస్టులు జరగనున్నాయి.



ఓవర్లో 6 సిక్సర్లు కొట్టడమే నా ప్రధాన లక్ష్యం!

ఆరు కలలను వెల్లడించిన యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ
విండీస్‌తో నేడు తొలి T20.. బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశం

బలగం టీవీ, హైదరాబాద్

ఒకే ఓవర్లో 6 బంతుల్లో 6 సిక్సర్లు బాదడమే తన కెరీర్ ప్రధాన లక్ష్యమని టీమిండియా టీనేజ్ బ్యాటింగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ స్పష్టం చేశాడు. వెస్టిండీస్‌తో టి20 సిరీస్ ప్రారంభానికి ముందు స్టార్ స్పోర్ట్స్ నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఈ 15 ఏళ్ల విధ్వంసకర బ్యాటర్, తన మనసులోని ఆరు ప్రధాన ఆశయాలను వెల్లడించాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఈ సంభాషణలో తన భవిష్యత్ లక్ష్యాలు, డ్రీమ్ సాధనల గురించి ఎలాంటి భయం లేకుండా నిర్భయంగా మాట్లాడి అందరినీ ఆకట్టుకున్నాడు.

ఆరు ప్రధాన ఆశయాలు ఇవే

తన కెరీర్ లక్ష్యాలకు సంబంధించి ముందుకు వచ్చిన ఆప్షన్లలో మొదటి ప్రాధాన్యతగా ఓవర్‌కి ఆరు సిక్సర్లు కొట్టడమేనని వైభవ్ పేర్కొన్నాడు. ఆ తర్వాత అంతర్జాతీయ టి20ల్లో అత్యంత వేగవంతమైన సెంచరీ బాదడాన్ని రెండో లక్ష్యంగా ఎంచుకున్నాడు. క్రికెట్ చరిత్రలోనే అత్యంత భారీ సిక్సర్ బాదడం మూడో ఆప్షన్‌గా కాగా, టీమిండియా తరపున టి20ల్లో అత్యధిక సెంచరీలు సాధించడాన్ని నాల్గో ప్రాధాన్యతగా తెలిపాడు. ఇక ఉత్కంఠగా సాగే మ్యాచ్‌లో ఆఖరి బంతికి సిక్స్ కొట్టి జట్టును గెలిపించడాన్ని ఐదో లక్ష్యంగా, క్రికెట్ చరిత్రలో గుర్తుండిపోయే అద్భుతమైన క్యాచ్ పట్టడాన్ని తన ఆరో ఆశయంగా వివరించాడు.

విధ్వంసకర ఆటతీరుతో ఆకట్టుకుంటున్న కుర్రాడు

పదిహేనేళ్ల చిన్న వయసులోనే విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగుతున్న వైభవ్ సూర్యవంశీ యావత్ క్రికెట్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుకున్నాడు. ఇప్పటివరకు 8 అంతర్జాతీయ టి20లు ఆడిన వైభవ్ రెండు హాఫ్ సెంచరీలు సాధించి, తొలి సెంచరీ కోసం ఎదురుచూస్తున్నాడు. ఐపీఎల్‌లో మాత్రం ఇప్పటికే 3 సెంచరీలు బాదేసి తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. అతను ఇదే జోరు కొనసాగిస్తే తాను నిర్దేశించుకున్న ఈ ఆరు లక్ష్యాలను కూడా అతి త్వరలోనే నెరవేర్చుకుంటాడని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విండీస్‌తో తొలి టి20లో బెంచ్‌కే పరిమితం

వెస్టిండీస్‌తో నేడు జరిగే మొదటి టీ20 మ్యాచ్‌లో వైభవ్‌కు తుది జట్టులో చోటు దక్కడం కష్టంగానే కనిపిస్తోంది. సంజూ శాంసన్, అభిషేక్ శర్మల ఓపెనింగ్ జోడిని కొనసాగించాలని టీమిండియా యాజమాన్యం భావిస్తుండటంతో, టీమ్ కాంబినేషన్ దృష్ట్యా వైభవ్ రిజర్వ్ బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల ఆసియా గేమ్స్ ఫైనల్లో పాకిస్థాన్‌పై గెలిచి పసిడి పతకం సాధించిన భారత జట్టులో వైభవ్ భాగస్వామిగా ఉన్న సంగతి తెలిసిందే.





ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా గంగూలీ

2027 ఐపీఎల్‌కు ముందు కీలక మార్పు.. సౌరవ్ గంగూలీకి కొత్త బాధ్యతలు

బలగం టీవీ, న్యూఢిల్లీ

ఐపీఎల్ సీజన్‌కు ముందు భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్‌గా నియమితులయ్యారు. గతంలో ఇదే ఫ్రాంచైజీలో సలహాదారుగా, పురుషుల, మహిళల జట్లకు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా పనిచేసిన గంగూలీకి జట్టుతో సుదీర్ఘ అనుబంధం ఉంది. గతేడాది డీసీకి చెందిన దక్షిణాఫ్రికా టీ20 లీగ్ జట్టు ప్రిటోరియా క్యాపిటల్స్‌కు కూడా ఆయన హెడ్ కోచ్‌గా వ్యవహరించారు.

హెడ్ కోచ్ బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని గంగూలీ తెలిపారు. దిల్లీ క్యాపిటల్స్ తనకు ఎంతో ఇష్టమైన ఫ్రాంచైజీ అని, యాజమాన్యం, సిబ్బంది, ఆటగాళ్లతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. కొత్త సీజన్ కోసం బలమైన, నిర్భయమైన జట్టును నిర్మించేందుకు ప్రతిభావంతులైన ఆటగాళ్లతో కలిసి పనిచేయాలని ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు.

దిల్లీ క్యాపిటల్స్ ఛైర్మన్, సహ యజమాని పార్థ్ జిందాల్ మాట్లాడుతూ గంగూలీ తమ ఫ్రాంచైజీలో ఎప్పుడూ అంతర్భాగంగానే ఉన్నారని అన్నారు. ఆయన అనుభవం, నాయకత్వం, దార్శనికత జట్టును మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. గంగూలీ మార్గదర్శకత్వంలో ఐపీఎల్ టైటిల్ కోసం పోటీ పడేందుకు జట్టు సిద్ధమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గత రెండు సీజన్లలో దిల్లీ క్యాపిటల్స్‌కు హేమాంగ్ బదానీ హెడ్ కోచ్‌గా వ్యవహరించారు. ఆయన ఆధ్వర్యంలో జట్టు ప్లేఆఫ్స్‌కు చేరకపోవడంతో యాజమాన్యం గంగూలీకి బాధ్యతలు అప్పగించింది. ఆటగాళ్ల మార్పిడి ఒప్పందంలో భాగంగా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ డీసీలోకి రాగా, మాజీ కెప్టెన్ రిషభ్ పంత్ కూడా తిరిగి జట్టులోకి వచ్చారు.